సాధ్యం కాదనే భావనను
మనసులోంచి తొలగించుకోవడమే
విజయపథంలో వేసే
తొలి అడుగు

- టెన్నిసన్

DD9 వార్త
తెలుగు దినపత్రిక
www.dd9vaartha.com
సంపుటి : 01 సంచిక : 180 సోమవారం, 16, ఫిబ్రవరి 2026, పేజీలు - 06 వెల : 3/-

## లోక్ సభ స్పీకర్ పై అవిశ్వాసానికి ముహూర్తం ఫిక్స్

**న్యూఢిల్లీ :** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల వేళ లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే ప్రధాన విపక్షం కాంగ్రెస్ పార్టీ నేతృత్వ ంలోని ఇతర విపక్ష పార్టీలు 100కు పైగా సంతకాలు పెట్టి అవిశ్వాస తీర్మానం నోటీ సు ఇచ్చాయి. దీనిపై అంతర్గతంగా చర్చిం చుకున్న కేంద్ర ప్రభుత్వ వర్గాలు... మా ర్చి 9న ఈ తీర్మానంపై లోక్ సభలో చర్చ పెట్టి, అదే రోజు ఓటింగ్ నిర్వహించాలని నిర్ణయించాయి. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల రెండో దశ మార్చి 8న ప్రారంభం కాబోతోంది.

దీంతో సమావేశాల తొలిరోజే లోక్ సభలో స్పీకర్ పై విపక్షాలు పెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చను, ఓటింగ్ ను నిర్వహిస్తామని పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు ఇవాళ వెల్లడించారు. ఏప్రిల్ 2 వరకూ పార్లమెంట్ బడ్జెట్ రెండో దశ సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులు ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకునేందుకు కేంద్రం ప్రయత్నాలు చేస్తోంది. వీటికి అడ్డంకి లేకుండా తొలిరోజే స్పీకర్ పై అవిశ్వాస తీర్మాన చర్చ, ఓటింగ్ పూర్తి చేయనున్నారు. ఇప్పటికే పార్లమెంట్ తొలిదశ బడ్జెట్ సమావేశాలకు విపక్షాలు తీవ్రంగా అడ్డుపడిన నేపథ్యంలో రెండో దశలోనూ అదే పరిస్థితి కొనసాగవచ్చని కేంద్రం అంచనా వేస్తోంది. అయితే రెండో దశ సమావేశాల్లో విపక్షాలు నిరసనలతో సభల్ని అడ్డుకోవాలని చూస్తే వారికే నష్టమని కేంద్రమంత్రి రిజిజు తెలిపారు.


# పాలకుడిగా నేను ఎప్పుడూ ప్రవర్తించలేదు

- సేవకుడిగా మాత్రమే వ్యవహరిస్తున్నా
- మాకు సేవ చేయడానికే ప్రజలు అవకాశం ఇచ్చారు
- పాలకుడిగా నేను ఎప్పుడూ ప్రవర్తించలేదు
- సేవాలాల్ జయంతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, ఫిబ్రవరి 15:** :తాము పాలకులం కాదు సేవకులమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నా రు. తమకు సేవ చేయడానికే ప్రజలు అవకాశం ఇచ్చారని తెలిపారు. పాలకుడిగా తాను ఎప్పుడూ ప్రవర్తించలేదని, సేవకు డిగా మాత్రమే వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. నేనే రాజు నేనే మంత్రి వ్యాఖ్యలను వక్రీకరించారని చెప్పారు. గెలుపు ఓటమి అన్నింటికీ తానే బాధ్యత తీసుకుంటానని చెప్పానన్నారు. వివిధ వర్గాలను పరిపాలనలో భాగస్వాములను చేయాలనే ఆలోచన తనదని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఎస్సీలు 17 శాతం ఉంటే తమ ప్రభుత్వంలో 30 శాతం ఉన్నారన్నారు. దళితులకు 3 మంత్రి పదవులు, స్పీకర్ ఇచ్చామన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసి వారికి మేలు చేశామన్నారు. సంత్‌సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన ఈ మేరకు మాట్లాడారు. సేవాలాల్ జయంతిని అధికారికంగా చేయడం తమ ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. అచ్చంపేట అడవుల్లో 20 ఎకరాల్లో సంత్ సేవాలాల్ పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. లంబాడీలు నాకు అండగా నిలిచారు : తెలంగాణ ఉద్యమంలో లంబాడీల పాత్ర మరిచిపోలేనిదన్న సీఎం రేవంత్, వారికి సముచిత స్థానం కల్పించాలని తమ ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. తాను గతంలో జడ్పీటీసీగా గెలిచేందుకు సహకరించింది నాగర్‌క ర్నూల్ జిల్లా మిడ్జిల్ లోని లంబాడీ యువకులేనని తెలిపారు. 20 ఏళ్ల రాజకీయ జీవితంలోని ప్రతి సందర్భంలో లంబాడీలు తనకు అండగా నిలిచారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రంలోని తండాలకు బీటీ రోడ్లు వేయాలని ఆదేశాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఆలోచనతోనే బీటీ రోడ్లు వేయనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రతి తండాలో పాఠశాల భవనాలు ఏర్పాట్లు చేయాలన్నారు. సోలార్ ప్లాంట్ల ద్వారా కరెంటు ఇచ్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపారు. గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. సన్నబియ్యం ధరలు తగ్గాయ్ : ప్రస్తుతం మార్కెట్‌లో కిలో సన్నబియం ధర రూ.45కు తగ్గిందని ముఖ్యమంత్రి చెప్పారు. 51 లక్షల పేద కుటుంబాలు 200 యూనిట్ల విద్యుత్ వినియోగిస్తున్నాయని చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణం కోసం ప్రభుత్వం రూ.9 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లోని 40 శాతం మెస్ ఛార్జీలు, 200 శాతం కాస్మోటిక్ ఛార్జీలు పెంచామన్నారు. 87 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు గ్రూప్ 1 ఉద్యోగాలు వచ్చాయని పేర్కొన్నారు.

## లొంగిపోయిన మావోయిస్టులకు తక్షణ ఆర్థిక సాయం, పునరావాసం కల్పిస్తాం



**హైదరాబాద్ :** అండర్‌గ్రౌండ్‌లో ఉన్న మావోయి స్టులు వెంటనే లొంగిపోయి జనజీవన స్రవంతిలోకి రావాలని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సీఎం రేవంత్ రెడ్డి పిలుపును మరో సారి తెలంగాణ పోలీసులు పునరుద్ఘా టించారు. గత రెండు సంవత్సరాల్లో 588 మంది మావోయిస్టులు లొంగి పోయారని, తెలంగాణాకి చెందిన 15 మంది క్యాడర్‌లు కూడా లొంగిపోవా లని డీజీపీ పిలుపునిచ్చారు. జనజీవన స్రవంతి లోకి వచ్చి శాంతి మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు లొంగిపోతే తక్షణ ఆర్థిక సాయం, పునరావాసం కల్పిస్తామని మావోలకు డీజీపీ హామీ ఇచ్చారు . కుటుంబాలతో గౌరవప్రదమైన జీవితం గడపాలని సూచించారు. సమాజంలో గౌరవంతో, స్వేచ్ఛతో, కుటుంబ సభ్యులతో కలిసి జీవించేందుకు అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తామని ప్రభుత్వం తరఫున హామీ ఇచ్చారు. శాంతి, అభివృద్ధి, సమాజ నిర్మాణం కోసం అందరూ కలిసి ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. జీవితం విడిచి కుటుంబాలతో కలసి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపు ఇచ్చారు.

## కేంద్ర ప్రభుత్వం రైతులకు ద్రోహం చేస్తోంది

- ట్రేడ్ డీల్‌పై రాహుల్ గాంధీ
అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందం
- ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రైతులకు ద్రోహం చేస్తోంది
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



**న్యూ ఢిల్లీ :** అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందంతో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రైతులకు ద్రోహం చేస్తోందని కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. దీర్ఘకాలంలో భారత వ్యవసాయ రంగంపై పట్టు సాధించడానికి మరొక దేశాన్ని అనుమతిస్తున్నారా అని ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. డ్రైడ్ డిస్టిలరీస్ గ్రెయిన్స్‌ను దిగుమతి చేసుకోవడం అంటే జన్యుమార్పిడి చేసిన అమెరికా మొక్కజొన్నను పాడి ఉత్పత్తిదారులకు అందించడమేనని రాహుల్ ఎక్స్‌లో రాసుకొచ్చారు. ఇది దేశ పాల ఉత్పత్తులను అమెరికా వ్యవసాయ పరిశ్రమపై ఆధారపడేలా చేయదా అని ప్రశ్నించారు. సోయా నూనె దిగుమతికి అనుమతిస్తే, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ సహా దేశవ్యాప్తంగా ఉన్న సోయా రైతులపై ప్రభావం ఉండదా అని నిలదీశారు. అదనపు ఉత్పత్తులు అంటే పప్పుధాన్యాలు సహా ఇతర పంటలను దిగుమతులకు భారత మార్కెట్‌ను తెరవాలనే ఒత్తిడిని సూచిస్తోందని రాహుల్ తెలిపారు. వాణిజ్యయేతర అడ్డంకులను తొలగిస్తామంటే భవిష్యత్తులో జన్యుమార్పిడి పంటలపై భారత్ తన వైఖరిని మార్చుకుంటుందా అని ప్రశ్నించారు. ఈ అంశంపై ప్రభుత్వం రైతులకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు

# కేసీఆర్‌ను మళ్లీ సీఎం చేసేందుకు మద్దతు ఇవ్వండి



**హైదరాబాద్, ఫిబ్రవరి 15:** మాజీ సీఎం కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేందుకు మద్దతుగా నిలవాలంటూ బంజారాలకు బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపునిచ్చారు. గిరిజనులకు రిజర్వేషన్లు పెంచిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే సేవాలాల్ బంజారా భవన్‌ను బంజారాహిల్స్‌లో నిర్మించారని గుర్తు చేశారు. ఆదివారం నాడు తెలంగాణ భవన్ లో మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా బంజారాలకు శుభాకాంక్షలు తెలిపారు. ఒకే రోజు నాలుగున్నర లక్షల ఎకరాలకు సంబంధించి గిరిజనులకు పోడు పట్టాలు అందించిన ఘనత కేసీఆర్‌దే అని తెలిపారు. మా తండాలో మా రాజ్యం ఉండాలన్న లాంబాడాల ఆత్మగౌరవాన్ని నిజం చేసింది బీఆర్ఎస్ అధినేత అని గుర్తు చేశారు. తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిందీ కేసీఆర్ అని చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలకు మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు కేటీఆర్. ఇక కాంగ్రెస్, సీపీఐ పార్టీలు అలయన్స్‌లో ఉన్నాయని.. సింగరేణి దోపిడీని అరికట్టడానికి తాను సీపీఐకి మద్దతు ఇస్తానన్నారు. సింగరేణిలో కాంగ్రెస్, బీజేపీలు కలిసి పని చేస్తున్నాయని విమర్శించారు. సీపీఐపైన ఏ ఒత్తిళ్లు వచ్చి కొత్తగూడెంలో కాంగ్రెస్‌తో పొత్తుకు ఒప్పుకుందో తనకు తెలియదని పేర్కొన్నారు. ఎవరు కలిసొచ్చినా, రాకున్నా తాము సింగరేణి అవినీతిపై పోరాటం చేస్తామని కుండబద్దలు కొట్టారు. హంగ్ వచ్చిన మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ అరాచకాలు చేస్తోందంటూ మండిపడ్డారు.

## 1,00,001 శివలింగాలు ఏర్పాటు చేసిన రైతు

- దేవుడి తోటకు రూ.22 లక్షల ఖర్చు!



**దావణగెరె జిల్లా:** చాలా మంది తమ సొంతింటి కలను సాకా రం చేసుకోవడానికి లక్షలాది రూపాయలు ఖర్చు చేయడం మనం చూస్తుంటాం. అయితే కర్ణాటకకు చెందిన ఓ రైతు తన కలలో శివలి ంగం కనిపించడంతో అనూహ్య నిర్ణయం తీసుకున్నాడు. ఏకంగా రూ.22 లక్షలు ఖర్చు పెట్టి తన పొలంలో ఏకంగా 1,00,001 శివలింగాలను ప్రతిష్ఠించాడు. వాటికి ప్రతిరోజూ అభిషేకం చేసి పూజిస్తున్నాడు. ఆధ్యాత్మిక కలను సాకారం చేసుకోవడం కోసం లక్షలాది రూపాయల డబ్బును, భూమిని వెచ్చించాడు.

## మేయర్ పీఠం కాంగ్రెస్‌దే




**కరీంనగర్, ఫిబ్రవరి 15:** కరీంనగర్ మేయర్ పీఠం కాంగ్రెస్ పార్టీదేనని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ధీమా వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీగా తమకు ఆ హక్కు ఉందన్నారు. ఆదివారం కరీంనగర్‌లో తో ఆయన మాట్లాడు తూ.. మేయర్ పీఠం కోసం కుట్రలు చేయాల్సిన అవసరం తమకు లేదని కుండ బద్దలు కొట్టినట్టు చెప్పారు. గతంలో 13 స్థానాలు ఉన్నప్పుడే తాము మేయర్ పీఠం సాధించామని గుర్తుచేశారు. బీజేపీకి కావాల్సినంత సంఖ్యా బలం లేదని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ చేస్తున్న ఆరోపణలను తాము పట్టించుకోమని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం.. సీఎం రేవంత్ రెడ్డి జిల్లా మంత్రులకు బాధ్యతలు అప్పగించారన్నారు. యినా.. బండి సంజయ్ గెలిస్తే ఒకటి.. తాము గెలిస్తే మరొకటా? అంటూ మంత్రి పొన్నం ప్రశ్నించారు. నిజామాబాద్‌లో మేయర్ పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ చెప్పారన్నారు. పూర్తి మెజార్టీ లేకపోవడంతోనే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారన్నారు. అయితే మెజార్టీ లేకపోయినా.. కరీంనగర్ మేయర్ పీఠాన్ని దక్కించుకుంటామని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఎలా చెబుతారని సందేహం వ్యక్తం చేశారు. కార్పొరేషన్లలో ప్రజాస్వామ్య బద్ధంగానే మేయర్‌ను ఎన్నుకుంటారంటూ ఈ సందర్భంగా ప్రభాకర్ గుర్తు చేశారు. మరోవైపు.. కరీంనగర్ మేయర్ పీఠంపై అధికార కాంగ్రెస్ పార్టీ ఆపరేషన్ చేపట్టింది. అందుకోసం ఆ పార్టీ అగ్రనేతలు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. మేయర్ సీటు బాధ్యతను.. మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌లకు అప్పగించారు సీఎం. దీంతో వారు కరీంనగర్ చేరుకున్నారు. ఈ నగర కార్పొరేషన్‌లో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో మేయర్ ఎన్నికపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కరీంనగర్ కార్పొరేషన్‌కు జరిగిన ఎన్నికల్లో బీజేపీ 30, కాంగ్రెస్ 14, బీఆర్ఎస్ 9, ఎంఐఎం 3, స్వతంత్ర అభ్యర్థులు 10 స్థానాల్లో గెలుపొందిన విషయం విదితమే. ఇక ముగ్గురు ఇండిపెండెంట్లు, అలిండియా ఫార్వార్డ్ బ్లాక్ అభ్యర్థి చేరికతో బీజేపీ బలం 34కు చేరింది. కార్పొరేషన్లలో మొత్తం 66 స్థానాల్లో.. ఎక్స్‌అఫీషియో ఓట్లు ఎంపీ బండి సంజయ్, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, కవ్వంపల్లి సత్యనారాయణలతో ఓట్ల 69కి చేరాయి. అయితే మ్యాజిక్ ఫిగర్ 36 కాగా.. బీజేపీ ప్రస్తుత బలం 35. అయితే సంఖ్యా బలం తమకే ఉందని కాంగ్రెస్ వివరిస్తోంది. ఇదిలా ఉండగా.. హైదరాబాద్ కేంద్రంగా క్యాంప్ రాజకీయాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి.

## మతం రంగు పూయొద్దు

- కోవా బన్ వ్యవహారంపై తీవ్రంగా మండిపడ్డ అసదుద్దీన్ ఒవైసీ



**హైదరాబాద్ :** మేడారం జాతరలో చెలరేగిన కోవా-బన్ వివాదం ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల్లో చిలికి చిలికి గాలి వానలా తయారవుతోంది. జాతరలో కోవా బన్ అమ్ముతున్న వ్యక్తిపై కొందరు యూట్యూబర్లు ప్రశ్నల వర్షం కురిపించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. అయితే దీనిపై ఆ యూట్యూబర్లను ఉద్దేశించి నెటిజన్లు తీవ్ర విమర్శలు గుప్పించారు. చిరు వ్యాపారి పేరు మీద మతం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారం తీవ్ర దుమారం రేపడంతో రాజకీయ నేతలు కూడా స్పందిస్తున్నారు. ఇప్పటికే కోవా బన్ విక్రేత వలీకి మద్దతుగా ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, జనసేన ఎమ్మెల్యే నాగబాబు వ్యాఖ్యలు చేయగా.. తాజాగా ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు నుంచి ములుగు జిల్లా మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతరకు వచ్చిన వలీ అనే ముస్లిం చిన్న వ్యాపారిని.. టార్గెట్ చేసుకొని కొంతమంది యూట్యూబర్లు ఫుడ్ జిహాద్ అని పేర్కొనడం పట్ల అసదుద్దీన ఓవైసీ ఘాటుగా స్పందించారు. శుభ్రత లేకుండా తయారు చేస్తున్నాడని.. వాటికి సంబంధించిన వీడియోలు తీసి సోషల్ మీడియాలో వైరల్ చేయడాన్ని ఆయన ఖండించారు. కుటుంబాన్ని పోషించేందుకు జాతరలో వ్యాపారం చేసుకుంటే.. అతనికి మతరంగు పులమడం అన్యాయం అని పేర్కొన్నారు.

## ట్రేడ్ డీల్స్‌లో సాధికారికంగా చర్చించే స్థాయికి భారత్ ఎదిగింది



**న్యూ ఢిల్లీ :** వాణిజ్య ఒప్పందాలపై విదేశాలతో సాధికారికంగా చర్చలు జరిపే స్థాయికి భారత్ ఎదిగిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశంలో తయారీరంగం, సేవారంగం, ఎంఎస్ఎంఈ పరిశ్రమలు బలోపేతం అయినందు వల్లే భారత్‌కు ఈ సాధికారత లభించిందని ఆయన తెలిపారు. భారత్ ఇప్పటికే 38 దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల(ఎఫ్‌టీఏ)ను కుదుర్చుకుందని ప్రధాని గుర్తు చేశారు. వస్త్ర, లెదర్, రసాయన, హస్తకళలు, రత్నాలు, ఇతర రంగాల్లోని భారతదేశ ఎంఎస్ఎంఈలకు విదేశీ మార్కెట్లను తెరిచేందుకు ఈ ఒప్పందాలు దోహదపడతాయన్నారు. ఆదివారం ప్రముఖ వార్తాసంస్థ పీటీఐకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ ఈ కామెంట్స్ చేశారు. గత కొన్నేళ్ల వ్యవధిలో మునుపటి రికార్డులను అధిగమించే రేంజులో విదేశాలకు భారత్ వస్తు, ఉత్పత్తుల ఎగుమతులు జరిగాయన్నారు. భారత్‌లో ప్రస్తుతం రాజకీయ సుస్థిరత ఉందని మోదీ తెలిపారు. దేశ రాజకీయ భవితవ్యంపైనా విదేశీ ఇన్వెస్టర్లు ఇప్పుడు ఈజీగా స్పష్టమైన అంచనాకు రావొచ్చన్నారు. అందుకే వారికి భారత మార్కెట్‌పై విశ్వాసం పెరుగుతోందని ప్రధాని చెప్పారు.

## శివనామ స్మరణతో మారు మోగిన దేవాలయములు





**బజార్ హత్నూర్, ఫిబ్రవరి 15(డిడి9వార్త న్యూస్ ):-**బజార్ హత్నూర్ మండలం లోని పిప్పిరి, గిర్నూర్, భూతాయి (బి ), గోకొండ, బజార్ హత్నూర్, తదితర గ్రామాలలో మహా శివరాత్రి సందర్భంగా శివాలయాలు, హనుమాన్ ఆలయాలల్లో ఆదివారం ఉదయం నుంచి శివనామ స్మరణతో మారు మోగింది. భక్తుల తాకిడితో ఆలయ ప్రాంగణం లన్నిసందడి నెలకొంది. ఆలయాలలో పూలు, పత్రీ,దూప, దీపాలతో మంగళ హరతులు ఇచ్చారు. టెంకాయలు కొట్టి, నైవేద్యం సమర్పించిన పిదప పలువురికి ప్రసాదంలు పంచిపెట్టారు. రాత్రి జాగరణ, ఉపవాస దీక్షలు చేశారు.

## శివలింగం ఆకారంలో విద్యార్థుల ప్రదర్శన



**బోథ్ ఫిబ్రవరి, 15(డిడి9వార్త న్యూస్):-**మహాశివరాత్రి సందర్భంగా బోథ్ మండలం లోని శ్రీ సరస్వతీ శిశు మందిరం ఆంగ్ల మీడియం విద్యార్థులు ఆదివారం రోజు పాఠశాలలో ఒక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా బాలబాలికలు శివుని లింగం ఆకారంలో గుమిగూడి ప్రదర్శన నిర్వహించారు. ఈ ఆకృతిపలువురిని అల్లరింప చేసింది.

## వృద్ధ, మహిళా భక్తులకు ఉచిత ఆటో సౌకర్యశీ



**బజార్ హత్నూర్, ఫిబ్రవరి, 15(డిడి9వార్త న్యూస్):-**భారతీయ జనతా పార్టీ యువ నాయకులు కచ్చకాయల హరీష్ అధ్వర్యంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని సోనాల రాజరాజేశ్వర దేవాలయం వరకు నడవలేని వృద్ధులు,మహిళలసౌకర్యార్థం సొనాల బస్టాండ్ నుశీచి దేవా లయం వరకు ఉచిత ఆటో సేవలను ఏర్పాటు చేశారు. వందల మంది మహిళలు,వృద్ధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కచ్చకాయల హరీష్ ను అభినందించారు. బిజెపి నాయకులు సుభాష్ సూర్య,బోరె రవీందర్,మిట్కరే రాజేశ్వర్,రామాయి సదానందం, కసిరె పోతన్న,గ్రామ యువకులు తదితరులు కూడా ఆయనతో పాల్గొన్నారు.

## నవీపేటలో వైభవంగా శివరాత్రి ఉత్సవాలు

**బోధన్, నిజామాబాద్ జిల్లా 15ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** నవీపేట్ మండల కేంద్రంలోని అమలాపూర్ వెళ్లే మార్గంలో నూతనంగా నిర్మించిన పంచాయతీ శివలింగ క్షేత్రం భక్తుల రాకతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఏటా అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ ఏడాది కూడా భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. నూతన ఆలయ ప్రతిష్ఠాపన అనంతరం భక్తుల భాగస్వామ్యంతో సేవా కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ రోజు రాత్రి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి మహారుద్రాభిషేకం, కిలోపత్రి ఆకుల సమర్పణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఆలయంలో ప్రతి నెల 21వ తేదీన క్రమం తప్పకుండా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో భక్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సుమారు రూ. 2 లక్షల విలువైన వంట సామాగ్రిని విరాళంగా అందజేయడం విశేషం. దాతలందరికీ ఆలయ కమిటీ సభ్యులు పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. నేడు ఆలయ ప్రాంగణంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఆలయ అభివృద్ధికి సాయం చేయదలచిన దాతలు ధన లేదా వస్తు రూపేణా కమిటీ సభ్యులను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

## నవీపేట్ లో ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకలు





**బోధన్, నిజామాబాద్ జిల్లా 15ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** నవీపేట మండల కేంద్రంలో సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలను మండల బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ: బంజారా జాతి గర్వించదగ్గ గొప్ప ఆధ్యాత్మిక గురువు సేవాలాల్ మహారాజ్ అని కొనియాడారు. సేవాలాల్ చూపిన మార్గం అత్యంత పవిత్రమైనదని, ఆయన బోధనల వల్లే నేడు బంజారా సమాజంలో గొప్ప చైతన్యం వచ్చిందని అన్నారు. "చెడు మార్గాలను విడనాడాలి, దొంగతనాలు చేయొద్దు, కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి" అని సేవాలాల్ ఆనాడే చెప్పిన మాటలు నేడు నిజమవుతున్నాయని పేర్కొన్నారు. నేటి తరం బంజారాలు విద్య, వైద్య, రాజకీయ, వ్యాపార రంగాల్లో రాణిస్తుండటం ఆయన కృపనేనని, బంజారా జాతిలో పుట్టడం తమ అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బంజారా సేవా సంఘం కార్యవర్గ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నగర పాలక పీఠానికి పటిష్ట భద్రత.. క్షేత్రస్థాయిలో సీపీ పరిశీలన



**నిజామాబాద్ జిల్లా 15ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** నిజామాబాద్ నగర పాలక సంస్థలో మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధమైంది. మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం కీలకమైన ఈ ప్రక్రియను శాంతియుత వాతావరణంలో పూర్తి చేసేందుకు పోలీస్ యంత్రాంగం నడుం బిగించింది. సోమవారం నిర్వహించనున్న ఎన్నికల బందోబస్తు ఏర్పాట్లను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన సీపీ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే కార్పొరేటర్లు, అధికారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు భద్రతా వలయాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కార్పొరేషన్ పరిసరాల్లో భారీ బందోబస్తు నిర్వహించాలని, ఎక్కడా జనం గుమిగూడకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పోలీస్, మున్సిపల్ యంత్రాంగం సమన్వయంతో పనిచేసి ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా చూడాలని సూచించారు. ఈ పర్యవేక్షణలో నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ ఎస్.దిలీప్ కుమార్, టౌన్-4 ఎస్.హెచ్.ఓ ఎస్. సతీష్ ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ





**కోటగిరి, ఫిబ్రవరి 15 (డీడీ9 వార్త):** నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలోని దేవునిగుట్ట తాండ గ్రామంలో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సేవాలాల్ సేన అధ్యక్షుడు సీతారాం నాయక్ మాట్లాడుతూ బంజారా సమాజానికి ఆధ్యాత్మిక మార్గదర్శకుడైన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రతి మండలం, ప్రతి తాండలో ఫిబ్రవరి 15న భోగి బండారు కార్యక్రమంతో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. బంజారా సమాజాన్ని చైతన్యవంతం చేయడానికి ఆయన జీవితాన్ని అంకితం చేసి చేసిన సేవలను గుర్తు చేశారు. ఆయన చూపిన మార్గం నేటి సమాజానికి ఆదర్శప్రాయమని కొనియాడారు. ప్రతి ఇంటిలో ఆవులను పెంచాలని సూచిస్తూ సమాజానికి అనేక మార్గదర్శకాలు అందించిన మహనీయుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోర రవి, జిల్లా సేవాలాల్ సేన అధ్యక్షుడు సీతారాం నాయక్, పౌర దేవి పీఠాధిపతి శివలాల్ మహారాజ్, మండల అధ్యక్షుడు తారా సింగ్ నాయక్, మండల కార్యదర్శి సురేష్, మాజీ సర్పంచ్ పుండలిక్, యమ్లా నాయక్, కరోబరి దేవులా నాయక్, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా కోటగిరి మండల సర్పంచ్ బర్ల మధుకర్ దంపతులు హాజరై జయంతి వేడుకల్లో పాల్గొన్నారు.

## జిల్లావ్యాప్తంగా శివనామస్మరణ.. భక్తులతో పోటెత్తిన శైవక్షేత్రాలు

- వైభవంగా మహాశివరాత్రి వేడుకలు
- వేకువజాము నుంచే అభిషేకాలు, అర్చనలు..

కిక్కిరిసిన క్యూలైన్లు












**నిజామాబాద్ జిల్లా 15ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** నిజామాబాద్ జిల్లావ్యాప్తంగా మహాశివరాత్రి పర్వదిన వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆదివారం జిల్లాలోని ప్రధాన శైవక్షేత్రాలన్నీ భక్తులతో పోటెత్తాయి. హరహర మహాదేవ.. శంభో శంకర అంటూ భక్తులు చేసిన శివనామస్మరణతో ఆలయ ప్రాంగణాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ నుంచి మొదలుకొని మారుమూల గ్రామాల వరకు శివాలయాలన్నీ విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబ య్యాయి. జిల్లా కేంద్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నీలకంఠేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడింది. మహాశివ రాత్రిని పురస్కరించుకొని వేకువజామున 4 గంటల నుంచే భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి స్వామివారి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్నారు. ఉపవాస దీక్షలో ఉన్న భక్తులు స్వామివారికి పాలాభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహించారు. రద్దీ దృష్ట్యా ఆలయ కమిటీ వారు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బోధన్ పట్టణంలోని చారిత్రాత్మక శ్రీ చక్రేశ్వర శివాలయంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఏసీపీ శ్రీనివాస్, సీఐ వెంకటనారాయణ స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లను క్రమబద్ధీకరించారు. బోధన్ మండలం పెంటాఖుర్దులోని మల్లికార్జున స్వామి ఆలయంలో ఒకే పానవట్టంపై రెండు శివలింగాలు ఉండటంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆర్మూర్ పట్టణంలోని ప్రఖ్యాతిగాంచిన నవనాథ సిద్ధులగుట్ట క్షేత్రం భక్తులతో నిండిపోయింది. నాగలింగేశ్వర ఆలయంలో శివలింగానికి పాలాభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం 11 గంటలకు శివపార్వతుల కళ్యాణాన్ని అర్చకులు వేద మంత్రాల మధ్య ఘనంగా నిర్వహించారు. భీమ్గల్ నందీశ్వర ఆలయంలో తెల్లవారుజా మున 5:30 గంటలకే సుప్రభాత సేవ, అభిషేకాలు ప్రారంభమయ్యాయి. సర్వసమాజ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మోపాల్ జడ్పీ హైస్కూల్లో యోగా టీమ్ సభ్యులు వివిధ రకాల ఆకులను ఉపయోగించి పరమశివుని రూపాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. ఈ వినూత్న అలంకరణ స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. నవీపేట్ మండలం ఫకీరాబాద్‌లోని శివాలయంలో శివపార్వతుల కళ్యాణానికి గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ పట్టువస్త్రాలు సమర్పిం చగా, గ్రామ కమిటీ సభ్యులు పుస్తె మెట్టలను అందజేశారు. ధర్పల్లి మండల కేంద్రంలో రాజరాజేశ్వర స్వామి ఉత్సవమూర్తులతో గ్రామ వీధుల్లో పల్లకీ సేవ నిర్వహించారు. మహిళలు మంగళ హారతులతో స్వామివారికి నీరాజనాలు అర్పించారు. ఇందల్వాయి మండలం గన్నారం గ్రామంలోని రాజరాజేశ్వర స్వామి ఆలయంలో యజ్ఞం, నిశి పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థలు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు భక్తుల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

## మహాశివరాత్రి పర్వదినాన ఆదియోగి విగ్రహ ఆవిష్కరణ







**కోటగిరి, ఫిబ్రవరి 15 (డీడీ9 వార్త):**నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలంలోని లింగాపూర్ గ్రామం గన్నారం శివారులో నూతనంగా నిర్మించబడిన అడికేశ్ లింగమయ్య దేవస్థాన ప్రాంగణంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదియోగి విగ్రహ ఆవిష్కరణ మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాత, ఆలయ కమిటీ చైర్మన్ ముమ్మలనేని రాజశేఖర్ -- పద్మశ్రీ వీణ దంపతుల చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే ఆలయంలో రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించగా, పార్వతి పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవాన్ని వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్ఛారణలతో, భజంత్రీల నాదంతో ఘనంగా నిర్వహించారు. దేవాలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి సంవత్సరం మహాశివరాత్రి సందర్భంగా రాత్రివేళ అగ్నిగుండం ఏర్పాటు చేస్తారని, ఉపవాసం చేసిన భక్తుల కోసం మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత, ఆలయ కమిటీ చైర్మన్ ముమ్మలనేని రాజశేఖర్ -- పద్మశ్రీ వీణ దంపతులతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు దేగం హనుమంతు, శారద రాజప్ప పటేల్, పుప్పాల గంగారం, రామకృష్ణ, శ్రీనివాసరావు, ములే రమణారెడ్డి, పనుగల్ల సుధీర్ బాబు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, మండల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బోధన్ ఏకచక్రేశ్వరుడి సన్నిధిలో సీపీ పూజలు



**బోధన్, నిజామాబాద్ జిల్లా 15ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బోధన్ పట్టణంలోని పురాతన శ్రీ ఏకచక్రేశ్వర స్వామి దేవాలయం భక్తులతో కిక్కిరిసింది. ఆదివారం ఆలయాన్ని సందర్శించిన నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సీపీకి ఘన స్వాగతం పలికి, వేద మంత్రోచ్ఛారణలతో ఆశీర్వచనం అందజేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయ పరిసరాల్లో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను సీపీ స్వయంగా పర్యవేక్షించారు. క్యూలైన్లలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, త్రాగునీరు వంటి కనీస వసతుల విషయంలో ఆలయ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఎక్కడా అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రాములు, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, ఎస్ హెచ్ ఓ వెంకట నారాయణ, ఎస్సైలు భాస్కర చారి, మనోజ్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు బోధన్ పురపాలక చైర్మన్ ఎన్నిక




**బోధన్, నిజామాబాద్ జిల్లా 15ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** బోధన్ పురపాలక సంఘంలో నూతన పాలకవర్గ కొలువుకు ముహూర్తం ఖరారైంది. సోమవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ల ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ జాదవ్ కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిలర్ల ప్రమాణస్వీకారం అనంతరం పురపాలక సంఘ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులకు ఎన్నిక నిర్వహించనున్నారు. ఈ మొత్తం ఎన్నిక ప్రక్రియకు ప్రెసిడింగ్ అధికారిగా సబ్ కలెక్టర్ వికాస్ మహతో వ్యవహరిస్తారని కమిషనర్ పేర్కొన్నారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికైన ప్రతినిధులంతా నిర్ణీత సమయానికి హాజరుకావాలని ఆయన కోరారు.

# పశుపతినాథ్ ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

**బోధన్, నిజామాబాద్ జిల్లా 15ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ శాంతినగర్ గౌడ్స్ కాలనీలో వేంచేసి ఉన్న పశుపతినాథ్ ద్వాదశ జ్యోతిర్లింగాలయంలో ఈ నెల 19, 20 తేదీల్లో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటన తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించనున్నారు. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, మాజీ మండల అధ్యక్షుడు రోషన్ లాల్ బోరా హాజరుకానున్నారని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

# సాలూర సోమేశ్వరాలయంలో శివరాత్రి వేడుకలు
## భక్తిశ్రద్ధలతో ప్రత్యేక అభిషేకాలు, పూజలు



**బోధన్, నిజామాబాద్ జిల్లా 15ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** సాలూర మండల కేంద్రంలో గల శ్రీ సోమేశ్వర ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. శివనామ స్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సోక్కం లావణ్య రవి దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పర్వదినం కావడంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గుడిని రంగురంగుల పుష్పాలు, విద్యుత్ దీపాలతో అత్యంత సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. రోజంతా భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో సాలూర గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆనవాయితీ ప్రకారం శివరాత్రి మరుసటి రోజున కుస్తీలు పోటీలు, జాతర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ చైర్మన్ లోకప్పగారి లక్ష్మణ్ పటేల్ తెలిపారు.

# చౌట్ పల్లిలో వైభవంగా శివ డోలోత్సవం



**నిజామాబాద్ జిల్లా 15ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** కమ్మర్ పల్లి మండలం చౌట్ పల్లి గ్రామంలో గల శ్రీ కోటిలింగేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలు పురస్కరించుకొని శివ డోలో త్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకులు గంగ ప్రసాద్ దీక్షిత్ ఆధ్వ ర్యంలో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పుష్ప లతో సుందరంగా అలంకరించారు. గంగ ప్రసాద్ దీక్షిత్ పర్యవేక్షణలో జరిగిన డోలోత్సవ సేవ లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని తరించారు. మంగళవాయిద్యాలు, శివనామ స్మరణల మధ్య స్వామివారిని ఊయలలో ఉంచి సేవించారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ.. కోటి లింగేశ్వర స్వామి సేవలో పాల్గొనడం మా పూర్వజన్మ సుకృతమని, వేడుక కనుల పండువగా సాగిందని తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేపట్టారు.

# యువతకు క్రీడలు ఎంతో అవసరం




**– బషీరాబాద్ యువజన సంఘానికి క్రికెట్ కిట్ల పంపిణీ**

**నిజామాబాద్ జిల్లా 15ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** యువత చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని, శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదప డతాయని బషీరాబాద్ సర్పంచ్ బైకాని జమున మహేష్ అన్నారు. కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ గ్రామ యువజన సంఘానికి ఆదివారం క్రికెట్ సామాగ్రిని వితరణ చేశారు. సర్పంచ్ జమున మహేష్‌తో పాటు ఉప సర్పంచ్ చిలివేరి భూమేశ్వర్, బైకాని ముఖేష్ సొంత ఖర్చులతో ఈ క్రీడా సామాగ్రిని యువకులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత యువతలో ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఇటువంటి ప్రోత్సాహం అవసరమని పేర్కొన్నారు. నేటి కాలంలో యువత వ్యసనా లకు దూరంగా ఉండి, క్రీడల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. క్రీడలు కేవలం వినోదం కోసమే కాకుండా, క్రమశిక్షణను, జట్టు స్ఫూర్తిని పెంపొం దిస్తాయని ఆయన తెలిపారు. తమకు క్రికెట్ కిట్లను అం దజేసి నందుకు యువజన సం ఘం సభ్యులు సర్ప ంచ్, ఉప సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం సభ్యులు వంకాయల తిరుపతి, తరుణ్ మరియు గ్రామ యువకులు పాల్గొన్నారు.

# పండగ వేళ విషాదం
# బంతి కోసం వెళ్లి బాలుడి మృతి

**ఆదిలాబాద్ జిల్లా బోథ్: ( డిడి 9 వార్త ) :** బోథ్ మండలంలోని కరత్వాడ లో గల మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ సమీపంలోని పార్కు లో సాయంత్రం. నాలుగు గంటల సమ య ంలో కరత్వాడ గ్రామానికి చెందిన షేక్ ఇమ్రాన్ సన్నాఫ్ అబ్దుల్ సలాం వయసు 12 సంవత్సరాలు అను పిల్లవాడు తన స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడడానికి వెళ్లి ఆట ఆడుతున్న సమయంలో బంతి పక్కన గల కాలువలో పడగా బంతి కోసం వెళ్ళిన షేక్ ఇమ్రాన్ ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందాడు. ఈ విషయం పై గ్రామంలో విషాద ఛాయలు అమలు కున్నాయి. పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బోథ్ ఎస్.ఐ వి. పురుషోత్తం తెలిపారు.



# పైన ఉండే ఆ తెల్లటి పొర ఏంటో తెలుసా



నిగనిగలాడే ద్రాక్ష గుత్తి చూస్తే ఎవరైనా వెంటనే నోట్లో వేసుకోవాలనిపిస్తుంది కదా... కానీ ఆ మెరుపు అంతా సహజమే అనుకోవడం పొరపాటు కావచ్చు. బయటకు అందంగా కనిపించినా... వాటిపై పురుగుమందుల అవశేషాలు, మైనపు పొర, కంటికి కనిపించని దుమ్ము ఉండే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా పిల్లలు నేరుగా ఫ్రిజ్ నుంచి తీసుకుని తింటే.. కాస్త జాగ్రత్త అవసరం .ద్రాక్ష గుత్తులుగా ఉండటం, పలుచని తొక్క ఉండటం వల్ల రసాయనాలు సులభంగా అతుక్కుంటాయి. వట్టి నీటితో కడిగితే పైపై ధూళి పోతుంది కానీ లోతుగా ఉన్న అవశేషాలు అంత సులభంగా తొలగవు. అందుకే కాస్త స్మార్ట్‌గా శుభ్రం చేయాలి.. అదీ ఇంట్లో ఉన్న సాదా పదార్థాలతోనే.మొదటిగా, ద్రాక్షను గిన్నెలో వేసి చల్లటి ప్రవహించే నీటిలో 20–30 సెకన్లు మెల్లగా చేతులతో రుద్దుతూ కడగాలి. ఇది పైపైన ఉన్న దుమ్ము, ధూళిని తొలగిస్తుంది. తర్వాతే అసలు శుభ్రపరిచే దశ మొదలవుతుంది.బేకింగ్ సోడా చాలా ఉపయోగపడుతుంది. ఒక లీటర్ నీటిలో ఒక టీస్పూన్ బేకింగ్ సోడా కలిపి, ద్రాక్షను 10–15 నిమిషాలు నానబెట్టాలి. ఇది అనేక పురుగుమందుల అవశేషాలను సడలించడంలో సహాయపడుతుంది. నానబెట్టిన తర్వాత మళ్లీ శుభ్రమైన నీటితో బాగా కడ గాలి.వాసన పూర్తిగా పోతుంది..వెనిగర్ కూడా మంచి సహజ శుభ్రకారి. ఒక భాగం వైట్ వెనిగర్‌ను మూడు భాగాల నీటితో కలిపి 5–10 నిమిషాలు నానబెట్టవచ్చు. ఇది కేవలం అవశేషాలనే కాదు, సూక్ష్మక్రిములను కూడా తగ్గిస్తుంది. ఆ తర్వాత తప్పకుండా మళ్లీ నీటితో బాగా కడగాలి.. వెనిగర్ వాసన పూర్తిగా పోతుంది.కడిగిన తర్వాత ద్రాక్షను తడిగా ఫ్రిజ్‌లో పెట్టకూడదు. మెల్లగా వస్త్రంతో తుడవాలి లేదా గాలిలో ఆరబెట్టాలి. పొడిగా ఉన్న ద్రాక్ష ఎక్కువకాలం తాజాగా ఉంటాయి, బూజు పడే ప్రమాదం తగ్గుతుంది.ఇంకో చిన్న టిప్ఒకేసారి అన్నీ కడగడం కంటే తినాల్సినంత మాత్రమే కడగడం మంచిది.

# ఈ జ్యూస్ తాగితే జుట్టు రాలుట ఆగి..
# వెంట్రుకలు నల్లగా, ఒత్తుగా

సమ్మర్ వచ్చిందంటే చాలు.. లీటర్ల కొద్దీ కూల్ డ్రింక్స్ లేపేస్తుంటారు. థంబ్సప్, స్ప్రైట్, మాజా.. అని రకరకాల కూల్ డ్రింక్స్ ను తాగేస్తుంటారు. కానీ ఫ్రెష్ జ్యూస్ లంటే మాత్రం నో చెబుతుంటారు. అయితే ఈ సమ్మర్ సీజన్ లో కూల్ గా ఉండటమే కాకుండా.. ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే బీట్ రూట్ యాపిల్ జ్యూస్ ను తయారు చేసుకోండి. ఈ జ్యూస్ ఆరోగ్యానికి చాలా మంచిదని వైద్యులు చెబుతున్నారు. తలనొప్పి, జుట్టు రాలడం, రక్తహీనత ఇలా అనేక సమస్యలకు ఈ జ్యూస్ చెక్ పెడుతుంది. మరి దీన్ని ఎలా తయారు చేయాలి.. ఇందుకోసం ఏమేం పదార్థాలు కావాలి..టేస్టీ బీట్ రూట్ యాపిల్ జ్యూస్ తయారీకి కావాల్సిన పదార్థాలు చూస్తే.. యాపిల్ ఒకటి, బీట్ రూట్ ఒకటి, అల్లం చిన్న ముక్క, నిమ్మరసం అర టీ స్పూన్, పటిక బెల్లం పొడి మూడు స్పూన్లు, మిరియాల పొడి 1/4 స్పూన్, క్యారెట్లు రెండు, ఉసిరికాయలు రెండు



తీసుకోవాలి.బీట్ రూట్ యాపిల్ జ్యూస్ తయారీకి ముందుగా యాపిల్ ను శుభ్రంగా కడిగి తొక్క తీసుకోవాలి. ఆ తర్వాత ముక్కలుగా కట్ చేసి పెట్టుకోవాలి. లోపలి గింజలను తీసి పడేయాలి. తర్వాత బీట్ రూట్ తీసుకుని తొక్క తీసేయాలి. చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకుని పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత క్యారెట్ ను తీసుకుని అలాగే చేయాలి. తొక్క తీసి ముక్కలు చేసుకొని పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఉసిరికాయలను కూడా శుభ్రంగా క్లీన్ చేసుకొని.. లోపలి గింజలు తీసేయాలి.

# మేయర్ ఎన్నికకు సర్వం సిద్ధం
## మున్సిపల్ కార్యాలయంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి తనిఖీ



**నిజామాబాద్ జిల్లా 15ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** నిజామాబాద్ నగరపాలక సంస్థ మేయర్ ఎన్నిక ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. సోమవారం జరగనున్న ఈ కీలక ఘట్టాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదివారం నగరపాలక సంస్థ కార్యాలయాన్ని సందర్శించారు. మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్‌తో కలిసి ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నిజామాబాద్ కార్పొరేషన్‌తో పాటు జిల్లాలోని బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీల్లోనూ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావుండకూడదని స్పష్టం చేశారు. నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లతో పాటు ఎక్స్ అఫీషియో సభ్యుల హోదాలో ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ సమావేశానికి హాజరుకానున్న నేపథ్యంలో ప్రోటోకాల్ పాటించాలని సూచించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మున్సిపల్ కార్యాలయాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. శాంతిభద్రతల దృష్ట్యా పరిసర ప్రాంతాల్లో గట్టి నిఘా ఉంచాలని కలెక్టర్ పేర్కొన్నారు.

# ఆధ్యాత్మిక బాటలో యువత... సాలూర నుంచి బోధన్‌కు పాదయాత్ర



**బోధన్, నిజామాబాద్ జిల్లా 15ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని యువత ఆధ్యాత్మిక మార్గంలో పయనిస్తోంది. సాలూర గ్రామంలోని సోమేశ్వర ఆలయం నుంచి బోధన్ పట్టణంలోని చారిత్రాత్మక ఏక చక్రేశ్వర శివాలయం వరకు యువకులు భారీ పాదయాత్ర నిర్వహించారు. సుమారు 35 మంది యువకులు శివనామ స్మరణ చేస్తూ కాలినడకన తరలివచ్చారు. లోక కల్యాణార్థం, భక్తిభావంతో గత 10 సంవత్సరాలుగా ఈ పాదయాత్రను నిరంతరాయంగా నిర్వహిస్తున్నట్లు యువకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. క్రమ శిక్షణతో కూడిన ఈ యాత్ర స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. బోధన్ చేరుకున్న యువ కులను పట్టణ సీఐ వెంకట నారాయణ అభినందించారు.

యువత ఇటువంటి ఆధ్యాత్మిక కార్య్ర కమాలు నిర్వహించడం ద్వారా సమాజానికి మంచి సందేశం అందుతుందని ఆయన కొని యా డారు. యువత తమ శక్తిని సన్మార్గంలో ఖర్చు చేయడం సంతోషదాయకం అని ఆయన పేర్కొన్నారు.

# కాలినడకన వేములవాడకు రెంజర్ల భక్తులు



**నిజామాబాద్ జిల్లా 15ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** ముప్కాల్ మండలంలోని రెంజర్ల గ్రామ భక్తులు తమ భక్తి చాటుకున్నారు. ఏటా నిర్వహించే ఆచారంలో భాగంగా ఈ ఏడాది కూడా సుమారు 100 మంది భక్తులు వేములవాడ రాజన్న క్షేత్రానికి కాలినడకన తరలివెళ్లారు. రెండు రోజుల క్రితం గ్రామం నుండి బయలుదేరిన భక్తులు సుమారు 100 కిలోమీటర్ల దూరాన్ని నడుచుకుంటూ ఆదివారం వేములవాడకు చేరుకున్నారు. మార్గమధ్యలో ఎదురైన ఇబ్బందులను సైతం లెక్కచేయకుండా, శివనామ స్మరణతో పాదయాత్రను ఉత్సాహంగా కొనసాగించారు. క్షేత్రానికి చేరుకున్న అనంతరం భక్తులు ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనం తరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా తమ గ్రామం నుండి ఈ సంప్రదాయం కొనసాగుతోందని, గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుతూ ఈ పాదయాత్ర చేపట్టామని తెలిపారు.

# నేటి నుంచి యథావిధిగా ప్రజావాణి

**నిజామాబాద్ జిల్లా 15ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** జిల్లాలో నిలిచిపోయిన ప్రజావాణి కార్యక్రమం తిరిగి ప్రారంభం కానుంది. మున్సిపల్ ఎన్నికల కోడ్ కారణంగా తాత్కాలికంగా వాయిదా పడిన ఈ ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని సోమవారం నుండి యథావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జరిగే ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చే బాధితులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో ప్రవర్తనా నియమావళి అమలులో ఉండటం వల్ల గత కొన్ని వారాలుగా ఈ కార్యక్రమం నిలిచిపోయిన సంగతి తెలిసిందే. సోమవారం నుండే ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. సామాన్య ప్రజల నుండి వచ్చే వినతులను ఎప్పటికప్పుడు పరిశీలించి సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు

## శ్రీ కాశీ విశ్వనాథ్ వద్ద మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహణ



**పోతంగల్, ఫిబ్రవరి 15 (డీడీ9 వార్త):** నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని శ్రీ కాశీ విశ్వనాథ్ మఠం వద్ద మహాశివరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.

సంవత్సరానికి ఒక్కసారి జరిగే ఈ మహాశివరాత్రి సందర్భంగా ఆలయ పూజారి వైదిక రత్న ప్రదీప్ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ కాశీ విశ్వనాథ స్వామివారికి పంచామృత అభిషేకం, రుద్రాభిషేకం, గణపతి పూజ, గౌరీదేవి ఆరాధన, ధ్వజారోహణం, స్వస్తి వాచనం, మండపారాధన, మహామృత్యుంజయ రుద్రహోమం, శ్రీ గురు ఇష్టలింగ పూజ, గ్రంథావిష్కరణ, సామూహిక ఇష్టలింగ పూజలు నిర్వహించారు. లింగోద్భవ స్వామివారికి 108 సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి వైదిక రత్న ప్రదీప్ స్వామి, మరాఠీ భజన మండలి సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హైకమాండ్ ముందు జీవన్ రెడ్డి ఆవేదన


**హైదరాబాద్, ఫిబ్రవరి 15:** ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ రాజకీయాల్లో సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. పార్టీలో జరుగుతున్న పరిణామాలు, పదవుల కేటాయింపుపై ఆయన తన గళాన్ని విప్పారు. ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథన్ సవాంగ్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌లతో భేటీ అయిన జీవన్ రెడ్డి, పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటాను.. కానీ!జీవన్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టమైన వ్యాఖ్యలు చేశారు. 'నేను ఎప్పుడూ పార్టీ క్రమశిక్షణ గల కార్యకర్తనే. పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి ఉంటాను. అయితే, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు జెండా మోసిన వారికే పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరుకుంటున్నాను' అని ఆయన పేర్కొన్నారు. తన ఆలోచనలు, సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని హైకమాండ్ ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో జరిగిన టికెట్ల కేటాయింపుపై జీవన్ రెడ్డి



గణంకాలతో సహా హైకమాండ్‌కు వివరించారు.గెలుపు గుర్రాల లెక్కలతో ఆవేదన..స్ట్రైక్ రేట్:స్ట్రైక్ రేట్: తనకు కేటాయించిన 16 బీ-ఫారమ్ లలో 9 మందిని గెలిపించుకున్నట్లు ఆయన గుర్తు చేశారు. ఇండిపెండెంట్లు: ఎంపీ సంజయ్ కుమార్ పక్కన పెట్టిన 9 మంది అభ్యర్థులు స్వతంత్రులుగా పోటీ చేసి గెలిచారని, అంటే వారు బలమైన అభ్యర్థులని ఆయన వాదించారు. సంజయ్‌కి 34 బీ-ఫారమ్ లు ఇస్తే కేవలం 14 మంది మాత్రమే గెలిచారని, తన వర్గం వారికి టికెట్లు రాకుండా పక్కన పెట్టడం వల్లే నష్టం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.అనుచరుల డిమాండ్: రాజ్యసభ సీటు ఇవ్వాల్సిందే!జీవన్ రెడ్డి మద్దతుదారులు కూడా ఏఐసీసీ సెక్రటరీ ముందు తమ వాదనను గట్టిగా వినిపించారు. జీవన్ రెడ్డి వంటి సీనియర్ నాయకుడిని విమర్శించడం సరికాదన్నారు. జీవన రెడ్డి పార్టీకి చేసిన సేవలను గుర్తించి, రానున్న రాజ్యసభ స్థానాన్ని జీవన్ రెడ్డికి కేటాయించాలని అనుచరులు, మద్దతుదారులు డిమాండ్ చేశారు. చైర్మన్ పదవుల కేటాయింపులో జీవన్ రెడ్డి వర్గానికి సముచిత స్థానం కల్పించాలని వారు కోరారు.

# ఎక్స్‌అఫీషియో కోసం అక్రమంగా ఓటు నమోదు చేయించుకున్న కాంగ్రెస్ ఎమ్మెల్సీ.

**కాగజ్‌నగర్ :** మున్సిపల్ పీఠం కోసం కాంగ్రెస్ పార్టీ నీచ రాజకీయాలకు తెరలేపింది. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో తనకు ఓటు లేకున్నా ఎక్స్‌అఫీషియో కోసం కాంగ్రెస్ ఎమ్మెల్సీ దండే విఠల్ అక్రమంగా తప్పుడు ఓటు నమోదు చేయించుకున్నారు. దీనికి సంబంధించి ఆధారాలను సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు




కోనప్ప బయటపెట్టారు.ఈ 16న జరిగే ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేయనున్నాడని.. దానిని అడ్డుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని కోనేరు కోనప్ప ఆరోపించారు. ఎక్స్‌అఫీషియో ఓటు వేసేందుకు ఎమ్మెల్సీ దండే విఠల్ చేత తప్పుడు మార్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఓటు నమోదు చేయించిందని తెలిపారు. దండే విఠల్‌కు ఎక్స్‌అఫీషియో ఓటు వేసేందుకు అర్హత లేదని పేర్కొన్నారు. దీనిపై తక్షణమే దర్యాప్తు జరిపి, విఠల్ ఓటును తొలగించాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారులకు కోనేరు కోనప్ప ఫిర్యాదు చేశారు. విఠల్‌ను ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా కొనసాగించకూడదని డిమాండ్ చేశారు.

# అగ్రి వర్సిటీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం - సీఐడీ దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి

**వరంగల్ :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరీక్షల్లో అక్రమాలపై పోలీసులకు కీలక ఆధారాలు లభ్యమయ్యాయి. ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై వర్సిటీ అంతర్గత విచారణతోపాటు సీఐడీ ప్రాథమిక దర్యాప్తులో సంచలన విషయాలు బయటకు వస్తున్నాయి. పీజేటీఏయూ పరిధిలోని మూడో సంవత్సరం విద్యార్థుల మొదటి సెమిస్టర్ 2025-26 పరీక్షలకు సంబంధించిన ఈ లీకేజీలో ఇంటిదొంగల నిర్వాకంపై కీలక సమాచారం లభించింది.ప్రశ్నపత్రాలు జిరాక్స్ తీసే సమయంలో : ఈ పరీక్షపత్రాల లీకేజీలో వరంగల్ వ్యవసాయ కళాశాలలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ కార్తిక్ కీలకపాత్ర వహించినట్లు సీఐడీ గుర్తించింది. ఇన్?సర్వీస్ విద్యార్థులకు పరీక్ష పత్రాలను అతనే లీక్ చేసినట్లుగా గుర్తించారు. ప్రశ్నాపత్రాల్ని జిరాక్స్ తీసే సమయంలోనే అతను తన సెల్‌ఫోన్‌తో ఫొటోలు తీసినట్లుగా బయటపడింది. ఇలా చేయాలని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో పూర్వ ఇన్?సర్వీస్ విద్యార్థిగా పనిచేసిన శ్రీకాంత్ ఒత్తిడి చేసినట్లు విచారణలో గుర్తించారు. ఈక్రమంలోనే కార్తిక్ బ్యాంకు ఖాతాలను పరిశీలించడంతో పెద్దఎత్తున నగదు లావాదేవీలు జరిగినట్టు గుర్తించి దర్యాప్తు ముమ్మరం చేశారు. అంతేకాకుండా మరికొన్ని ప్రశ్నాపత్రాల లీకేజీకి సంబంధించిన సమాచారం వెల్లడి కావడం విస్తుగొలిపే అంశంగా మారింది.మూడో ఏడాది మొదటి సెమిస్టర్ మిడ్ ఎగ్జామ్స్ ప్రశ్నాపత్రాలను సిరిసిల్ల బీజేఆర్ వ్యవసాయ కళాశాలలో పొరుగు సేవల సిబ్బంది అజయ్ లీక్ చేసినట్లుగా తేలింది. అతడి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని తనిఖీ చేయగా గతంలో జరిగిన మరికొన్ని సెమిస్టర్ల




ప్రశ్నాపత్రాలను గుర్తించి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో కొన్నేళ్లుగా ఇన్సర్వీస్ విద్యార్థులకు సంబంధించిన పరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకేజీ కొనసాగి ఉంటుందనే అనుమానాల నేపథ్యంలో సీఐడీ దర్యాప్తు మరింత ప్రాధాన్యం సంతరించుకొంది. ఈ దర్యాప్తు కొలిక్కివస్తే మరికొందరి పాత్ర బయటపడే అవకాశాలు ఉన్నాయి.అసాధారణ రీతిలో మార్కులు రావడంతో : క్లిష్టంగా భావించే ఓ పరీక్షలో ఇన్సర్వీస్ స్టూడెంట్లు అసాధారణ రీతిలో మార్కులు సాధించడం అనుమానాలకు దారి తీసింది. దీంతో వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, డీన్ ఝాన్సీరాణి గత ఏడాది డిసెంబర్ 24వ తేదీన జగిత్యాలలోని వ్యవసాయ కళాశాలలో తనిఖీలు నిర్వహించారు. నవంబర్ 17వ తేదీన జరిగిన ఆ పరీక్షకు సంబంధించి సీసీ కెమేరాలను పరిశీలించడంతో రమేశ్ అనే విద్యార్థి కదలికలు అనుమానస్పదంగా కనిపించాయి. ఈనేపథ్యంలోనే ఎంటమాలజీ హెచ్‌వోడీ నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ సైంటిస్ట్ అంజయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఎన్.పి.రవికుమార్, సంపత్‌లతో కలిపి విచారణ బృందాన్ని నియమించింది.ఈ బృందం జనవరి 5న జగిత్యాలకు వెళ్లి విద్యార్థి రమేష్‌ను విచారించింది. అదే కళాశాలకు చెందిన ఇన్?సర్వీస్ విద్యార్థి శ్రీనివాస్ తనకు ప్రశ్నాపత్రాల్ని వాట్సప్‌లో పంపించినట్లు రమేశ్ వెల్లడించినట్టు సమాచారం. శ్రీనివాస్‌ను విచారించగా అశ్వరావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థి దుర్గారావు వాటిని తనకు పంపినట్లు తేలింది. అశ్వారావుపేట కళాశాలకే చెందిన విద్యార్థిని నుంచి తనకు వాట్సప్‌లో ప్రశ్నాపత్రాలు అందినట్లు దుర్గారావు వెల్లడించారు.కేసు దర్యాప్తు ముమ్మరం చేసిన సీఐడీ : అశ్వారావుపేట విద్యార్థినిని విచారించగా వరంగల్ వ్యవసాయ కళాశాలకు చెందిన మరో విద్యార్థిని వాట్సప్ లో పంపినట్లు తేలింది. ఇందుకోసం అశ్వారావుపేట కళాశాలలోని పలువురు విద్యార్థుల నుంచి తాను రూ.1.4 లక్షలను వసూలు చేసినట్లు అంగీకరించారు. అందులో నుంచి రూ.80వేలను వరంగల్ కళాశాల విద్యార్థిని బదిలీ చేసినట్లు చెప్పారు. వరంగల్ కళాశాల విద్యార్థినిని విచారించడంతో కార్తిక్ నిర్వాకం బట్టబయలయింది. కార్తిక్ సదరు విద్యార్థినికి వాట్సప్‌లో ప్రశ్నాపత్రాలను పంపినట్లు తేలింది. వరంగల్ విద్యార్థిని ద్వారానే ప్రశ్నాపత్రాలు వరంగల్, జగిత్యాల, పాలెం, ఆదిలాబాద్, రాజేంద్రనగర్, సిరిసిల్ల, అశ్వారావుపేట కళాశాలల్లోని ఇన్?సర్వీస్ విద్యార్థులకు చేరినట్లు అనుమానిస్తున్నారు. మొత్తంగా సీఐడీ ఈ కేసు దర్యాప్తును ముమ్మరం చేసింది. త్వరలోనే ఈ వ్యవహారంలో అరెస్టులు చేసే అవకాశం ఉంది.

# కేసీఆర్ జన్మదిన వేడుకలకు విస్తృత ఏర్పాట్లు : మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్




**హైదరాబాద్ :** ఈ నెల 17 న తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు () ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలంగాణ భవన్‌లో ఇన్‌చార్జి రావుల చంద్ర శేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవి కుమార్, కిషోర్ గౌడ్, ముఠా జయసింహతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం తలసాని మీడియాతో మాట్లాడారు. కరెంట్, నీళ్ల గోస లేకుండా చేసిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. పేదింటి ఆడబిడ్డ పెండ్లికి కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ , పేదలకు ఆసరా పింఛన్లు, విద్యార్థులకు గురుకులాలను, రైతులకు , ప్రజలకు సాగు, తాగు నీటికి ఇబ్బంది లేకుండా చేసిన నాయకుడు కేసీఆర్ అని ప్రశంసించారు. కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఆలయాలు, చర్చిలు, మసీదులలో ప్రత్యేక పూజలు, ప్రార్థనలను నిర్వహిస్తున్నామని వివరించారు.17 న కేసీఆర్ బర్డ్‌డే సందర్భంగా తెలంగాణ భవన్‌లో కేక్ కటింగ్ కార్యాక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని వెల్లడించారు. న్సిపల్ ఎన్నికలలో అధికార పార్టీకి ధీటుగా ప్రతి పక్ష బీఆర్ఎస్‌కు ఓట్లు వచ్చాయని అన్నారు


# రెండోసారి కమలం చేజారిన ఇందూరు పీఠం మజ్లిస్‌తో కలిసి మేజిక్ ఫిగర్

**నిజామాబాద్ :** మున్సిపల్ కార్పొరేషన్ పీఠం భారతీయ జనతా పార్టీకి అందని ద్రాక్షలా మారింది. వరుసగా రెండుసార్లు సింగల్ లార్జెస్ట్ పార్టీగా ఆవిర్భవించినప్పటికీ పీఠం మాత్రం దక్కక పోవటం చర్చనీయాంశంగా మారింది. ఉత్కంఠ భరితంగా సాగిన పోరులో చివరికి ఇందూరు మేయర్ పీఠం హస్తగతం అయింది. ఎంఐఎంతో కలిసి కాంగ్రెస్ పార్టీ మేయర్ పీఠాన్ని దక్కించుకుంది. అధికారికంగా ప్రకటన రావడమే మిగిలింది. అయితే ఈ ఎన్నిక ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. కాంగ్రెస్ -- బీజేపీ మధ్య నువ్వా నేనా అన్నట్లు సాగిన ఈ పోరులో చివరికి అధికార కాంగ్రెస్ పై చేయి సాధించింది. ఆ పార్టీ నుండి మేయర్ అభ్యర్థి ఎవరు అనేది ఇపుడు కీలంగా మారింది.నిజామాబాద్ మున్సి1పల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ బీజేపీ మధ్య పోరు కాక రేపింది. హోరా హోరీగా సాగిన ఈ ప్రక్రియలో చివరికి మేయర్ పీఠం హస్తగతం అయింది. మరోసారి మేయర్ పీఠం బీజేపీ చేజారింది. సోమవారం (ఫిబ్రవరి 16) మేయర్ ఎన్నిక అధికారికంగా జరగనున్న నేపథ్యంలో రెండూ పార్టీల బాలా బలాల విషయంలో ఇప్పటికే స్పష్టత వచ్చింది. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో మొత్తం 60 డివిజన్ లు ఉండగా బీజేపీ 28 స్థానాల్లో గెలుపొంది సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించింది.బీజేపీకి మరో మూడు ఎక్స్ అఫిషియో స్థానాలు ఉన్నాయి. నిజామాబాద్ ఎంపీ అరవింద్, అర్బన్ ఎమ్మెలే ధన్పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెలే పైడి రాకేష్ రెడ్డి ఓట్లతో కలిపి బీజేపీ సంఖ్య 31కి చేరింది. కానీ బీజేపీ కంటే రెండు ఓట్లు కాంగ్రెస్ పార్టీకి ఎక్కువగా ఉన్నాయి.కాంగ్రెస్ సంఖ్యను పరిశీలిస్తే కాంగ్రెస్ పార్టీ స్వతహాగా గెలిచిన స్థానాలు 17 కాగా, ఎంఐఎం గెలిచిన 14



స్థానాలు తన ఖాతాలో కలుపుకుంది. బీఆర్ఎస్ నుండి గెలిచిన ఏకైక అభ్యర్థి కూడా కాంగ్రెస్ శిబిరంలో చేరారు. దీనికి తోడు కాంగ్రెస్ పార్టీకి రెండు ఎక్స్ అఫీషియో ఓట్లు ఉన్నాయి. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఎమ్మెల్సీగా, రూరల్ ఎమ్మెలే భూపతి రెడ్డిలు ఎక్స్ అఫీషియో ఓటర్లుగా ఉన్నారు. అంటే కాంగ్రెస్ పార్టీ మొత్తం సంఖ్య 34 కు చేరింది. మేజిక్ ఫిగర్ దాటి, మేయర్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధం అయింది. ఇప్పటికే కాంగ్రెస్ -- ఎంఐఎం, బీఆర్ఎస్ అభ్యర్థులు హైదరాబాద్ క్యాంపులో ఉన్నారు. సోమవారం నేరుగా మేయర్ ఓటింగ్ కోసం మున్సిపల్ కార్యాలయానికి చేరుకుంటారని తెలుస్తోంది. అయితే కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థి విషయంలో మంతనాలు కొనసాగుతున్నాయి. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమార్ ఈ విషయంలో కసరత్తు చేస్తున్నారు. సామాజిక వర్గాల సమీకరణలు లెక్కిస్తున్నారు. ప్రధానంగా నాలుగు పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం. మున్నూరు కాపు సామాజికవర్గం నుండి పంచరెడ్డి లలిత, గౌడ సామాజికవర్గం నుండి పూజిత గౌడ్ లతో పాటు మరో ఇద్దరు అరుంధతి, ఉమారాణి పేర్లను పరిశీలిస్తున్నారుఇదిలా ఉంటే వరుసగా రెండు సార్లు బీజేపీ పార్టీకి మేయర్ పదవి దక్కినట్లే దక్కి చేజారిపోవటం చర్చనీయాంశంగా మారింది. గత మున్సిపల్ ఎన్నికల్లో కూడా బీజేపీకి 28 సీట్లు దక్కగా, అప్పుడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ -- ఎంఐఎంతో కలిసి మేయర్ పీఠాన్ని దక్కించుకోగా, ఈసారి కాంగ్రెస్ పార్టీ అదే ఫార్ములాతో మేయర్ స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో నిజామాబాద్ కార్పొరేషన్ మేయర్ పీఠం బీజేపీకి అందని ద్రాక్షలా మారింది. ఆ పార్టీకి 28 సీట్ల ఫిగర్ అచ్చి రావడం లేదా అనే చర్చ నడుస్తుంది. కాకపోతే వరుసగా రెండు పర్యాయాలు ఆ పార్టీకి 28 సీట్లే రావడమేంటి?, రెండు సార్లు సేమ్ సీన్ రిపీట్ అవ్వడమేంటి అని చర్చించుకుంటున్నారు.కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేసిన మిగతా అన్ని రాజకీయ పార్టీల కన్నా సింగిల్ లార్జెస్ట్ పార్టీగా నిలిచినా అధికారం దక్కకపోవడం పట్ల బీజేపీ తీవ్రంగా మదన పడుతుంది. ఇందులో భాగంగానే ఎంఐఎం తో కలిసి ఇతర పార్టీలు రెండు సార్లు మేయర్ పీఠం దక్కించుకోవడంపై ఎంపీ అరవింద్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు తిరస్కరించిన పార్టీలు మేయర్ పదవులను గద్దల్లా తన్నుకుపోతున్నాయని ధర్మపురి మండిపడ్డారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని దిగజారుతున్నారని ఆరోపించారు. ఒక్క స్థానంలో గెలిచిన బీఆర్ఎస్ అభ్యర్థిని పోలీసులతో కాంగ్రెస్ పార్టీ కిడ్నాప్ చేయించిందని సంచలన వీడియోను సోషల్ మీడియా ఎక్స్ లో పోస్టు చేశారు. దానిని కాంగ్రెస్ పార్టీ ఖండించింది. మొత్తం మీద నిజామాబాద్ మేయర్ పీఠం మరోసారి బీజేపీ చేజారిపోయింది. పీఠం దక్కినట్లే దక్కి రెండు సార్లు మిస్ అవడం కాషాయదళం జీర్ణించుకోలేక పోతుంది.

# హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు.. నెల వ్యవధిలో 23వ బెదిరింపు కాల్




**హైదరాబాద్ : నగరంలో**ని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు కాల్ వచ్చింది. ఈ మేరకు మెయిల్ ద్వారా బెదిరింపు అందింది. ఆదివారం ఉదయం సింగపూర్-హైదరాబాద్ విమానంలో బాంబు పెట్టినట్లు మెయిల్ రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. శంషాబాద్ విమానాశ్రయంలో విమానం ల్యాండ్ కాగానే ప్రయాణికులను కిందకు దింపి, తనిఖీలు చేపట్టారు.కానీ బాంబు లభ్యం కాలేదు. దాంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఈ బెదిరింపు మెయిల్ ఎక్కడి నుంచి వచ్చింది, ఎవరు పంపించారు అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గత డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు ఈ రెండు నెలల వ్యవధిలో శంషాబాద్ విమానాశ్రయానికి 23 నకిలీ బాంబు బెదిరింపు కాల్స్ వచ్చినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. కొన్ని ఫోన్ కాల్స్ విదేశాల నుంచి వచ్చినట్లు గుర్తించారు.

# భువనగిరిలో కాంగ్రెస్ అరాచకం ఓట్లు వేయలేదని బీరు సీసాలతో ఇళ్లపై దాడి



**యాదాద్రి భువనగిరి :** మున్సిపల్ ఎన్నికల్లో ఓట్లు వేయలేదన్న కక్షతో కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు గుండాలు అరాచకానికి పాల్పడ్డారు. భువనగిరి పట్టణంలోని ఒకట వార్డు కాంగ్రెస్ అభ్యర్థి పలబోజు స్వరూపరాణి ఓటమి జీర్ణించుకోలేక పద్మశాకులస్తుల ఇండ్ల పై ఖాళీ బీరు సీసాలతో దాడులకు పాల్పడ్డారని బాధితులు ఆరోపించారుఓటర్లను ఆకర్షించేందుకు పంచిపెట్టిన చీరలు, హాట్ బాక్స్ లను రోడ్డు మీద వేసి నిరసన తెలిపారు. కాంగ్రెస అరాచకాలు నశించాలంటూ ర్యాలీ నిర్వహించి పీఎస్ ఎదుట ఆందోళన నిర్వహించారు. దాడులకు పాల్పడ్డ వారితో ప్రాణభయం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

# జగిత్యాల ఎపిసోడ్‌కు ఫుల్‌స్టాప్

**హైదరాబాద్/జగిత్యాల, ఫిబ్రవరి 15:** గత కొద్ది రోజులుగా జగిత్యాల కాంగ్రెస్ రాజకీయాల్లో సెగలు పుట్టించిన అంతర్గత విభేదాలు ఎట్టకేలకు సద్దుమణిగాయి. ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథన్ సవాంగ్ రంగప్రవేశం చేసి, ఇరు వర్గాల నేతలతో జరిపిన చర్చలు సఫలమయ్యాయి. దీంతో జగిత్యాల ఎపిసోడ్‌కు ముగింపు పడినట్లు అయింది.నేతలతో సవాంగ్ భేటీ.. క్లాస్ పీకిన అధిష్టానంఏఐసీసీ సెక్రటరీ సవాంగ్.. ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మాజీ మంత్రి జీవన్ రెడ్డితో విడివిడిగా, అనంతరం కలిసి చర్చలు జరిపారు. పార్టీ అంతర్గత విషయాలను రోడ్డుపైకి తీసుకురావడం వల్ల కేడర్‌లో అయోమయం నెలకొంటుందని ఆయన సున్నితంగా హెచ్చరించారు. క్రమశిక్షణే ముఖ్యమని, పార్టీ తీసుకునే తుది నిర్ణయానికి ఇరువురు నేతలు కట్టుబడి ఉండాలని సవాంగ్ స్పష్టం చేశారు. ఐక్యత చాటాలని, రాబోయే



ఎన్నికలు, పార్టీ బలోపేతం దృష్ట్యా నేతలు కలిసి పనిచేయాలని సూచించారు.జెండా మోసిన వారికే పట్టం!ఈ భేటీలో అత్యంత కీలకమైన నిర్ణయం పదవుల కేటాయింపుపై జరిగింది. పార్టీ కోసం కష్టపడి, జెండా మోసిన నిజమైన కార్యకర్తలకు, పాత తరం నాయకులకే మున్సిపల్ చైర్మన్ వంటి కీలక పదవులు ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించింది. ఇది జీవన్ రెడ్డి వర్గానికి కొంత ఊరటనిచ్చే అంశంగా కనిపిస్తోంది.జీవన్ రెడ్డి డిమాండ్లపై సానుకూలత తొలి నుంచి జీవన్ రెడ్డి వాదిస్తున్నట్లుగా.. పార్టీని నమ్ముకుని ఉన్న వారికే ప్రాధాన్యత ఇవ్వాలన్న సూచనను ఏఐసీసీ పరిగణనలోకి తీసుకున్నట్లు సమాచారం. సంజయ్ కుమార్ కూడా పార్టీ ప్రయోజనాల దృష్ట్యా సర్దుకుపోయేందుకు అంగీకరించినట్లు తెలుస్తోంది.ఎపిసోడ్‌కు ఫుల్‌స్టాప్.. ఈ భేటీతో జగిత్యాల కాంగ్రెస్‌లో నెలకొన్న అనిశ్చితి తొలిగిపోయింది. నేతలు ఇద్దరూ కలిసి పనిచేస్తామని హామీ ఇవ్వడంతో కార్యకర్తలు ఊపిరి పీల్చుకుంటున్నారు. పదవుల పంపకంలో 'విధేయతకే పెద్దపీట వేయాలని నిర్ణయించడం ద్వారా పార్టీ కేడర్‌లో కొత్త ఉత్సాహం నింపే ప్రయత్నం చేస్తోంది కాంగ్రెస్ అధిష్టానం.

# సంత్ సేవాలాల్‌కు నివాళు లర్పించిన సీఎం చంద్రబాబు



**అమరావతి:** గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోనూ సేవాలాల్ జయంతి వేడుకలను గిరిపుత్రులు వేడుకగా చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివాళులు అర్పించారు.ఈ మేరకు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. అహింస, మానవత్వం, సమానత్వానికి సేవాలాల్ మార్గదర్శనం చేశారని ముఖ్యమంత్రి కొనియాడారు. సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా ఆ మహనీయుడు చూపిన శాంతి మార్గాన్ని, ఆయన బోధించిన జీవన విలువలను మనసారా స్మరించుకుందామని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారుకాగా, ఉండవల్లిలోని తన కార్యాలయంలో శనివారం నాడు నిర్వహించిన సంత్ సేవాలాల్ మహరాజ్ 287 జయంతి వేడుకల్లో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..'రూ.50లక్షలు కేటాయించి సేవాలాల్ జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నాం. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు కేటాయిస్తాం. ఆయన మన రాష్ట్రంలో జన్మించడం మనందరి అదృష్టం.సేవాలాల్ సిద్ధాంతాలు ఎప్పటికీ ఆదర్శమే. సేవాలాల్ స్ఫూర్తితో గిరిజనుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పని చేస్తోంది. నీట్, ఐఐటీ సీట్లు సాధించేలా గురుకులాల్లో ఎస్టీ విద్యార్థులకు శిక్షణ అందిస్తాం. ఆదివాసీ ప్రాంతాల్లో పెద్దఎత్తున మౌలిక వసతులు కల్పిస్తున్నాం. ఉచితంగా సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేస్తున్నాం. 2026-27 వార్షిక బడ్జెట్‌లో రూ.9,190 కోట్లు ఎస్టీల కోసం కేటాయించాం' అని చెప్పారు.

# ఎన్టీఆర్ ట్రస్ట్ అంటే భరోసా, నమ్మకం



**అమరావతి, ఫిబ్రవరి 15:** ఎన్టీఆర్ ట్రస్ట్ అంటే ఒక భరోసా, నమ్మకమని.. ఏపీ విద్యా, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. విద్య, వైద్యం, ఉపాధి ద్వారా ఈ ట్రస్ట్ ఎందరో జీవితాల్లో వెలుగులు నింపిందని తెలిపారు. ఈ ట్రస్ట్ ఎలాంటి లాభాపేక్ష లేకుండా ప్రజలకు సేవలందిస్తోందని వివరించారు. సామాజిక సేవే పరమావధిగా ముందుకు సాగుతోందని చెప్పారు. ఆదివారంతో 30వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ట్రస్ట్‌కు లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారాయన.అలాగే.. ఆదివారం మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా తెలుగు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు మంత్రి లోకేశ్. భోళా శంకరుడు లింగోద్భవం చెందిన పవిత్రమైన రోజు.. ఈ మహా శివరాత్రి అని ఆయన పేర్కొన్నారు. ఉపవాసం, జాగరణతో నీలకంఠుడి కృపకు ప్రజలు పాత్రులు కావాలని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు.

# 53శాతం సీట్లలో విజేతలు బీసీలే: ఆర్.కృష్ణయ్య



**రాంనగర్:** మున్సిపల్ ఎన్నికల్లో 53శాతం సీట్లలో బీసీలు గెలవడం వారి చైతన్యానికి నాంది అని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. ప్రాదేశిక (ఎంపీటీసీ, జడ్పీటీసీ) ఎన్నికల్లో చట్టబ ద్ధంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని.. అంత వరకూ రాష్ట్ర ప్రభుత్వాన్ని వదిలి పెట్టే ప్రసక్తి లేదన్నారు. ప్రభుత్వంతోపాటు తమకు అన్యాయం చేయడానికి కుట్రలు చేసిన పార్టీలకు బీసీలు తగిన గుణపాఠం నేర్పారని విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో శనివారం జరిగిన ఓ సమావేశంలో ఆయన చెప్పారు. మునిసిపల్ ఎన్నికల్లో 42% అమలు చేస్తామని ప్రకటించి 28 శాతానికి తగ్గించి అక్రమాలకు పాల్పడటం దుర్మార్గమని కృష్ణయ్య ఆరోపించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై హైకోర్టులో దాఖలైన 62 కేసుల విచారణకు సీనియర్ న్యాయవాదులను నియమించాలన్నారు. ఆయా కేసుల విచారణను చేపట్టేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు.

# బడ్జెట్ ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పిలుపు



**విశాఖపట్నం, ఫిబ్రవరి 15:** ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మించే దిశగా కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్‌ను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని టీడీపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఇవాళ (ఆదివారం) విశాఖపట్నం నుంచి కూటమి ఎమ్మెల్యేలు, కీలక నేతలతో ఆయన నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో బడ్జెట్ ప్రాధాన్యతలపై సుదీర్ఘంగా చర్చించారు. 'విధ్వంసం నుంచి వికాసం వైపు' సాగుతున్న ఈ ప్రయాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.వ్యవస్థను గాడిలో పెట్టే 'విజన్ డాక్యుమెంట్'గత ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తంగా మారిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మళ్లీ పురోగతి పట్టించేలా ఈ బడ్జెట్ ఉందని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. భారత శతాబ్ది ఉత్సవాల నాటికి ఏపీ అగ్రగామిగా ఉండాలనే లక్ష్యంతో (విజన్-2047) ఈ బడ్జెట్ రూపకల్పన జరిగిందని చెప్పారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో జనసేన నేత, మంత్రి నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ కూడా పాల్గొని, కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని ఎలా సమతుల్యం చేస్తోందో వివరించారు.ఇది గణాంకాల పుస్తకం కాదు.. ప్రజల జీవిత రేఖ: ఎమ్మెల్యే గణబాబుబడ్జెట్‌పై ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఈ బడ్జెట్ కేవలం అంకెలతో కూడిన పుస్తకం కాదు, ఇది కోట్లాది మంది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే ఒక బ్లూ ప్రింట్. మాటల కోసం కాకుండా, చేతల్లో ప్రగతిని చూపించే విజన్ డాక్యుమెంట్ ఇది.' అని ఆయన వ్యాఖ్యానించారు.కూటమి నేతలు ఈ సందర్భంగా బడ్జెట్‌లోని కీలక అంశాలను ప్రస్తావించారు. సుమారు రూ. 3.32 లక్షల కోట్లతో కూడిన భారీ బడ్జెట్‌గా పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, మహిళా సంక్షేమం కోసం దాదాపు రూ. 91,527 కోట్లు కేటాయించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టులతో పాటు విద్యా రంగానికి (రూ. 32,308 కోట్లు) అత్యధిక ప్రాధాన్యతనిచ్చారని పేర్కొన్నారు.

# పరమశివుని ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకుంటున్నాను

**అమరావతి, ఫిబ్రవరి 15:** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పరమేశ్వరుడి అనుగ్రహంతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) వేదికగా ఒక సందేశాన్ని విడుదల చేశారు.క్షేత్రాల పవిత్రతకు పెద్దపీటఆంధ్రప్రదేశ్ పుణ్య భూమి అని కొనియాడిన పవన్ కళ్యాణ్.. శ్రీశైల జ్యోతిర్లింగ క్షేత్రం, శ్రీకాళహస్తి వాయులింగ క్షేత్రం, పంచారామ క్షేత్రాల విశిష్టతను గుర్తు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆలయాల పవిత్రతను కాపాడటమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.ప్రభుత్వ ఆధ్వర్యంలో శివరాత్రి వేడుకలురాష్ట్రవ్యాప్తంగా ఉన్న 41 ప్రముఖ శైవ క్షేత్రాల్లో ప్రభుత్వం అధికారికంగా శివరాత్రి వేడుకలను నిర్వహిస్తోందని, ఇది తమ ప్రభుత్వ భక్తి భావానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. 'శ్రీకాళహస్తి గిరి ప్రదక్షిణ మార్గంలో నూతన సిమెంటు రోడ్డు నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించాం. కోటప్పకొండ భక్తుల సౌకర్యార్థం గిరి ప్రదక్షిణ మార్గం రోడ్డు నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశాం.' అని పవన్ తెలిపారు. ఓఆలయాలకు మెరుగైన రవాణా సౌకర్యాలుప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలోని చిన్న, పెద్ద ఆలయాలన్నింటికీ రోడ్డు సౌకర్యం కల్పించేందుకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు.'ఆలయాల అభివృద్ధికి, ధర్మ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుంది. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ఆ పరమశివుని ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకుంటున్నాను.' అని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కోరుకుంటూ భక్తుల ందరికీ.. పవన్ కళ్యాణ్ శివరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు.



# జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు ప్రారంభించిన పవన్ కళ్యాణ్

**మంగళగిరి:** జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేదిశగా ఆ పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కీలక ముందడుగు వేశారు. ఫిబ్రవరి 15న ఉదయం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో 'క్రియాశీలక సభ్యత్వ నమోదు' కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారాయ న. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ స్వయంగా మొదటి సభ్యత్వాన్ని తీసుకో వడమే కాకుండా.. సభ్యత్వ నమోదు( ప్రక్రియ కోసం తన వంతుగా రూ.2 కోట్ల భారీ విరాళాన్ని పార్టీకి అందజేశారు పవన్.పార్టీ భావజాలాన్ని లోతుగా అర్థం చేసుకుని.. పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసేందుకు ఎవరైతే ముందుకు వచ్చి పార్టీ సభ్యత్వం తీసుకుంటారో వారిని 'ఉద్యమి'గా పిలుస్తామన్నారు. పార్టీ పోరాటానికి మరింత బలాన్ని అందించి, నవతరంలో ప్రేరణ కలిగించి పార్టీ సిద్ధాంతాలకి ఆకర్షితులను చేసి సభ్యత్వ నమోదు చేసేవారిని 'సాధక్'గానూ, జనసేన పార్టీ చేస్తున్న ప్రజా, రాజకీయ పోరాటానికి పరోక్షంగా తమ వంతు సమయాన్ని, ఆర్థిక, సాంకేతిక, సేవా, మేథా సహాయ సహకారాలు అందిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేసేవారిని 'ప్రదాత'గా పిలుస్తామని ప్రకటించారు పవన్ కళ్యాణ్.ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. 'జనసేన పార్టీని 150 మందితో పార్టీని ప్రారంభించాం. 2021లో మొదటి విడత క్రియాశీలక సభ్యత్వం ప్రారంభించినప్పుడు 90 వేల పేర్లు నమోదు చేశాం. ఎన్నికలకు ముందు ఆ సంఖ్య 6 లక్షలకు చేరింది. ఎన్నికల తర్వాత 12.98 లక్షల సభ్యత్వాలు సాధించాం. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారి నుంచి కూలీ పనులు చేసుకునే వారు, చదువుకున్న వారు.. ఇలా ఎంతో మంది ఈ ప్రక్రియలో భాగస్వాములయ్యారు. పార్టీ భావజాలాన్ని అర్థం చేసుకుని, పార్టీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేవారు మనకు ముఖ్యం. అలాంటి వారే పార్టీకి అవసరం' అని చెప్పారు. కార్యక్రమంలో నాదెండ్ల మనోహర్, పిడుగు హరిప్రసాద్ తదితర నేతలు పాల్గొన్నారు.




# కొత్త ఉద్యోగంలో చేరిన జేడీ లక్ష్మీనారాయణ

**అమరావతి:**వాసగిరి వెంకట లక్ష్మీనారాయణ.. ఈ పేరు చెప్పగానే చాలా మందికి ఆయనెవరో గుర్తు రాకపోవచ్చు. కానీ జేడీ లక్ష్మీనారాయణ అంటే చాలు ఠక్కున గుర్తుపడతారు. సీబీఐ అధికారిగా జగన్ అక్రమాస్తుల కేసు సహా అనేక హై ప్రొఫైల్ కేసులను దర్యాప్తు చేయడంతో ఆయన పేరు అప్పట్లో మార్మోగింది. మహారాష్ట్ర కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అయిన వీవీ లక్ష్మీనారాయణ .. ముంబైలో అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ జనరల్‌గా పదవీ విరమణ పొందారు. అనంతరం రాజకీయాల్లోకి వచ్చిన ఆయన జనసేన తరఫున విశాఖపట్నం ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత 2023లో జై భారత్ నేషనల్ పార్టీ పేరిట సొంత పార్టీ పెట్టారు. అంతకు ముందు తూర్పుగోదావరి జిల్లా ధర్మవరంలో ఆయన పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం కూడా చేశారు. ఆయన కుమారుడు కూడా ఆలిండియా సర్వీసులో పని చేస్తున్నారు.జేడీ లక్ష్మీనారాయణ తాజాగా ఓ ఉన్నత ఉద్యోగంలో చేరారు. ఈవీట్రాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఆపరేషన్స్ విభాగంలో వైస్ ప్రెసిడెంట్‌గా ఆయన చేరారు. ఈవీ ట్రాన్స్ అనేది మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ ( మెయిల్)కు అనుబంధ సంస్థ. ఐపీఎస్ అధికారిగా దాదాపు మూడు దశాబ్దాలపాటు సుదీర్ఘ సేవలు అందించిన జేడీ లక్ష్మీనారాయణను ఈవీట్రాన్స్ వైస్ ప్రెసిడెంట్‌గా తీసుకోవడానికి కారణం ఉంది.జేడీ లక్ష్మీనారాయణ ఎన్ఐటీ వరంగల్ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ చదివారు. అనంతరం ఐఐటీ మద్రాస్ నుంచి ఎంటెక్ పూర్తి చేశారు. తర్వాత అశోక్ లేల్యాండ్ ఆర్ అండ్ డీ విభాగంలో కెరీర్ మొదలుపెట్టారు. ఆ సమయంలో కమర్షియల్ వెహికల్ సిస్టమ్, మాన్యుఫ్యాక్చరింగ్ ఎన్విరాన్మెంట్స్ మీద ఆయన అనుభవం సంపాదించారు.ఈవీట్రాన్స్ సంస్థ ఎలక్ట్రిక్ బస్సుల తయారీని వేగవంతం చేస్తోంది. ఈ క్రమంలో లక్ష్మీనారాయణ అనుభవం, కార్య దక్షత తమకు ఉపకరిస్తాయని ఆ సంస్థ భావిస్తోంది. లక్ష్మీనారాయణ నియామకం విషయాన్ని ఈవీట్రాన్స్ సంస్థ లింక్డ్ఇన్ ద్వారా స్వయంగా వెల్లడించింది. 2006-13 మధ్య డిప్యూటేషన్ మీద సీబీఐకి వెళ్లిన లక్ష్మీనారాయణ.. జాయింట్ డైరెక్టర్ స్థాయికి ఎదిగారని.. ఈ సమయంలో ఆయన అనేక హైప్రొఫైల్ కేసులను దర్యాప్తు చేశారని కూడా ఈవీట్రాన్స్ గుర్తు చేసింది.తెలంగాణ ఆర్టీసీలో నడుస్తోన్న ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సులను ఈ సంస్థే తయారు చేసింది. ఒక్క తెలంగాణ ఆర్టీసీనే కాకుండా.. ముంబై, పుణే, గోవా తదితర ప్రాంతాల్లో ఈ సంస్థ తయారు చేసిన ఎలక్ట్రిక్ బస్సులు పరుగులు తీస్తున్నాయి. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తోన్న ఈవీట్రాన్స్.. దేశంలోనే అతిపెద్ద ఎలక్ట్రిక్ బస్ ఆపరేటర్‌గా అవతరించింది.ఇదిలా ఉండగా.. లక్ష్మీనారాయణ భార్య ఇటీవల ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్‌లో రూ.2.58 కోట్లు మోసపోయిన సంగతి తెలిసిందే. ట్రేడింగ్ నిపుణులమని పరిచయం చేసుకొని.. భారీ లాభాలు ఆశచూపిన స్కామర్లు ఊర్మిళను మోసం చేశారు. దీంతో లక్ష్మీనారాయణ దంపతులు జనవరి నెలలో సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు.




# మేడారం కోవా బన్ వివాదం వలీకి అండగా నిలిచిన నారా లోకేష్

**కర్నూలు :**కర్నూలుకు చెందిన కోవా బన్ వ్యాపారి వలీకి ఏపీ మంత్రి నారా లోకేష్ అండగా నిలిచారు. త్వరలోనే వలీని కలుస్తానంటూ ట్వీట్ చేశారు. వలీ చేసిన కోవా బన్ తినడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నానంటూ మంత్రి నారా లోకేష్ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. వలీపై కొంతమంది ఆరోపణలు చేయడం కలచివేసిందన్న నారా లోకేష్.. మన సమాజంలో ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నాలకు తావు లేదంటూ ట్వీట్ చేశారు. "ప్రియమైన సోదరుడు వలీ. మీరు దీన్ని భరించాల్సి వచ్చినందుకు నేను చాలా బాధపడుతున్నా. ఎల్లప్పుడూ సామరస్యం, పరస్పర గౌరవం, సోదరభావంతో ఉండే మన తెలుగు సమాజంలో ఇలాంటి విభజన, మతపరమైన ప్రవర్తనకు స్థానం లేదు. నేను త్వరలో మిమ్మల్ని కలుస్తా.. మీ ఫేమస్ కోవా బన్‌ను రుచి చూడటం కోసం ఎదురు చూస్తున్నా" అంటూ నారా లోకేష్ ట్వీట్ చేశారు.ఏపీ మంత్రి నారా లోకేష్ కర్నూలు కోవా బన్ వ్యాపారి వలీకి మద్దతుగా నిలిచారు. అతనికి సంఘీభావం ప్రకటించారు. త్వరలోనే వలీని కలుస్తానని.. అతని కోవా బన్ టేస్ట్ చేస్తానంటూ ట్వీట్ చేశారు. మన సమాజంలో ఇలాంటి ఘటనలకు తావులేదన్న నారా లోకేష్.. వలీకి జరిగిన దానికి బాధపడుతున్నానని అన్నారు. మరోవైపు మేడారం జాతరలో వలీ కోవా బన్ స్టాల్ వద్ద యూట్యుబర్లు ప్రవర్తించిన తీరుపై సోషల్ మీడియాలో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే నారా లోకేష్ స్పందించారు.రాయలసీమలోని కర్నూలుకు చెందిన వలీ.. ఇటీవల జరిగిన మేడారం జాతరలో ఓ చిన్న స్టాల్ పెట్టుకున్నారు. ఆ స్టాల్ వద్ద రూ.10లకు కోవా బన్ అమ్ముతూ జీవనోపాధి వెతుక్కున్నారు. అయితే కొంతమంది యూట్యూబర్లు వలీతో ప్రవర్తించిన తీరు.. అతని కోవా బన్ మీద అనుమానాలు రేకెత్తించేలా వ్యవహరించిన వైనం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో లైకులు, షేర్ల కోసం యూట్యూబ్ ఛానెల్స్ ఓ చిరు వ్యాపారిని ఇబ్బందులు పెట్టారంటూ సోషల్ మీడియాలో పెద్దఎత్తున వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ క్రమంలోనే నెటిజనం నుంచి వలీకి మద్దతు లభించింది. అతనికి అండగా నెటిజన్లు ఈ విషయాన్ని వైరల్ చేశారు. ఈ క్రమంలోనే పలు రాజకీయ పార్టీల నేతలు కూడా కోవా బన్ వ్యవహారం మీద స్పందించటంతో తెలుగు రాష్ట్రాల్లో కోవా బన్ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది.



# పోలీసులకు బిగ్ రిలీఫ్ ఆ పథకం పునరుద్ధరణ.

**అమరావతి:**2026 -27 బడ్జెట్ సందర్భంగా ఏపీ ప్రభుత్వం రాష్ట్రంలోని పోలీసులకు శుభవార్త చెప్పింది. పోలీసుల కోసం ఓ పథకాన్ని పునరుద్ధరించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రకటించారు. బడ్జెట్ ప్రసంగంలో ఏపీ ప్రభుత్వం పోలీస్ శాఖలో తీసుకువచ్చిన ఆధునికీకరణ కార్యక్రమాలతో పాటుగా.. వారికి అమలు చేస్తున్న సంక్షేమ చర్యల గురించి పయ్యావుల కేశవ్ వివరించారు. ఈ క్రమంలోనే పోలీస్ శాఖలో ఉచిత బీమా కవరేజీ అందించే గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీమ్ పునరుద్ధరించనున్నట్లు తెలిపారు. ఈ పథకం కింద కానిస్టేబుల్ నుంచి డీజీపీ వరకు రూ.20 లక్షలు నుంచి రూ.45 లక్షల వరకు ఉచితంగా బీమా కల్పిస్తారు.ఇదే సమయంలో పోలీస్ శాఖకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మరికొన్ని శుభవార్తలు కూడా అందించారు. మూడు వేల నూతన వాహనాలను ఏపీ పోలీసులకు త్వరలో అందించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో డిజిటల్ అరెస్టులు, సైబర్ నేరాల కట్టడి కోసం పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయనున్నట్లు పయ్యావుల కేశవ్ తెలిపారు. టెక్నాలజీ సాయంతో ఏపీ పోలీస్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామన్న మంత్రి.. ఇందులో భాగంగా ఏఐ ఆధారిత ప్రాజెక్టులు, స్మార్ట్ పోలీసింగ్ ల్యాబులు, సీసీటీవీ, డ్రోన్లు, ఆధునిక కమ్యూనికేషన్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వివరించారు.






## నాకు వర్షం సినిమాలాగే అనిపిస్తుంది

ప్రస్తుతం చిన్న సినిమాలు థియేటర్లలో సందడి చేస్తున్న సంగతి తెలిసిందే. ఇక వాలెంటైన్స్ వీక్ సందర్భంగా ఈ వారం మొత్తం చిన్న చిత్రాల హవా నడుస్తోంది. ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలై ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఇప్పుడు అలాంటి ఓ చిన్న సినిమా గురించి పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఆసక్తికర పోస్ట్ చేశారు. తనకు వర్షం సినిమా ఎలాగో.. అలాగే యంగ్ హీరోకు ఈ సినిమా అలాగే అంటూ రాసుకొచ్చారు. అసలు విషయానికి వస్తే.. యంగ్ హీరో సంతోష్ శోభన్ ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ మూవీ కపుల్ ఫ్రెండ్లీ. దాదాపు రెండేళ్ల విరామం తర్వాత ఈ హీరో నటించిన ఈ సినిమా వాలెంటైన్స్ డే సందర్భంగా ఫిబ్రవరి 14న రిలీజ్ అయ్యింది. ఈ సినిమాకు యూత్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తుంది. జీవితంలో ఎలాంటి ఆశలు లేని ఓ కుర్రాడి జీవితంలోకి ఓ అమ్మాయి రావడం.. ఆ అమ్మాయితో ఒకే ఇంట్లో గడపాల్సి రావడం.. తర్వాత ఇద్దరి జీవితాల్లోకి ఎలాంటి పరిస్థితులు వచ్చాయి అనేది సినిమా.తాజాగా ఈ మూవీపై ప్రశంసలు కురిపించారు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్. “ఇదొక లవ్లీ, బ్యూటీఫుల్ ఫిలిం. కపుల్ ఫ్రెండ్లీ సినిమాను చాలా ఎంజాయ్ చేశాను. సంతోష్, మానస వారణాసి జోడి వండర్ ఫుల్ గా ఉంది. అశ్విన్ ఎంతో ప్రతిభావంతంగా సినిమాను తెరకెక్కించాడు. ఇలాంటి కథలను వెండితెరపైకి తీసుకువచ్చినందుకు అజయ్, యువీ క్రియేషన్స్ టీమ్ మొత్తానికి అభినందనలు. నాకు వర్షం సినిమా ఎలాగో.. మై డియర్ సంతోష్ శోభన్ కు కపుల్ ఫ్రెండ్లీ అలా అవుతుంది” అంటూ రాసుకొచ్చారు ప్రభాస్. ఇప్పుడు డార్లింగ్ చేసిన ఈ పోస్ట్ ఈ చిత్రానికి బూస్టప్ లా పనిచేస్తుంది.సంతోష్ శోభన్ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాకు అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహించారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ తెలుగు, తమిళ భాషలలో నిర్మించిన ఈ చిత్రానికి ఆదిత్య రవీంద్రన్ సంగీతం అందించారు. ఇందులో మానస వారణాసి కథానాయికగా నటించింది. ఈ చిత్రాన్ని ధీరజ్ మొగిలినేని రిలీజ్ చేశారు.



## లిజార్డ్ టెక్స్చర్ లెదర్ జాకెట్ లో సల్మాన్ ఖాన్ లుక్ అదుర్స్

ఆ ఒక్క జాకెట్ ధరతో మన దేశంలో ఒక లగ్జరీ ఎస్‌యూవీ (ాఖు) కారును కొనేయవచ్చు. కేవలం బ్రాండ్ పేరు కోసమే కాకుండా, దాని తయారీలో వాడిన మెటీరియల్, దాని డిజైన్ ఇప్పుడు ఫ్యాషన్ వరల్డ్ లో చర్చనీయాంశంగా మారాయి. బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్ ధరించిన ఆ అల్ట్రా–లగ్జరీ జాకెట్ విశేషాలేంటో చూద్దాం.కారు కంటే ఖరీదైన జాకెట్..ఇటీవల జరిగిన వెరైటీ మ్యాగజైన్ లాంచ్ ఈవెంట్ లో సల్మాన్ ఖాన్ తన లుక్ తో అందరినీ ఆశ్చర్యపరిచారు. ఆయన ధరించిన ‘బ్రియోని’ ఎంబాస్డ్ లెదర్ జాకెట్ ధర సుమారు రూ.62,30,100 రూపాయలు. అంటే అక్షరాలా అరకోటి కంటే ఎక్కువే! భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన టయోటా ఫార్చ్యూనర్ టాప్ మోడల్ ధర కంటే ఈ జాకెట్ ఖరీదు ఎక్కువ కావడంతో నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. “ఒక మనిషి ఫార్చ్యూనర్ కారును ఒంటిపై వేసుకుని తిరుగుతున్నాడు” అంటూ ఫ్యాన్స్ కామెంట్లతో రచ్చ చేస్తున్నారు.బ్రియోని బ్రాండ్ ప్రత్యేకత..ఇటలీకి చెందిన బ్రియోని అనేది ప్రపంచంలోని టాప్ లగ్జరీ బ్రాండ్లలో ఒకటి. సాధారణంగా హాలీవుడ్ స్టార్స్, వివిధ దేశాల అధ్యక్షులు ఈ బ్రాండ్ వస్తువులను ధరిస్తుంటారు. ఇది ‘క్వైట్ లగ్జరీ’ అనే కాన్సెప్ట్ మీద నడుస్తుంది. అంటే దీని మీద పెద్ద పెద్ద లోగోలు కనిపించవు కానీ, దీని నాణ్యత, తయారీ విధానం చూస్తేనే అది ఎంతటి ఖరీదైనదో అర్థమవుతుంది. సల్మాన్ ఖాన్ ధరించిన ఈ జాకెట్ ప్రీమియం కాఫ్ లెదర్ తో తయారైంది. ఈ జాకెట్ పై ఉన్న లిజార్డ్–స్కిన్ ఎంబాస్డ్ (పెద్ద బల్లి లేదా క్రాకడైల్ టెక్స్చర్ లాంటి) ఫినిష్ దీనికి ఒక రాయల్ లుక్ ఇచ్చింది. చాలా దృఢంగా, మగతనాన్ని ఉట్టిపడేలా చేసే ఈ డిజైన్ కు గోల్డ్ జిప్స్ మరియు బటన్స్ అదనపు ఆకర్షణగా నిలిచాయి. సాధారణంగా సల్మాన్ ఖాన్ డార్క్ కలర్స్ ను ఎక్కువగా ఇష్టపడతారు. ఈ నలుపు రంగు లెదర్ జాకెట్ ఆయన పర్సనాలిటీకి పర్ఫెక్ట్ గా సెట్ అయ్యింది.‘బాప్ ఆఫ్ బాలీవుడ్ స్టైల్’..సల్మాన్ ఖాన్ లేటెస్ట్ ఫోటోలు వైరల్ కావడంతో ఇంటర్నెట్ లో ఆయన స్వాగ్ పై చర్చ మొదలైంది. “స్టైల్ లో ఆయనకు ఆయనే సాటి.. బాప్ ఆఫ్ బాలీవుడ్ స్టైల్” అంటూ నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. కేవలం సినిమా ప్రమోషన్ల కోసమే కాకుండా, పర్సనల్ లైఫ్ లో కూడా సల్మాన్ ఇంతటి ఖరీదైన వస్తువులను వాడటం ఆయన హోదాను తెలియజేస్తోంది. గతంలోనూ సల్మాన్ ఖాన్ వాడిన వాచీలు కోట్ల రూపాయల ధర పలికాయి.ఇప్పుడు ఈ రూ.62 లక్షల జాకెట్ ఆ లిస్టులో చేరిపోయింది. గానే ఉంటుంది. ఒకప్పుడు కేవలం ఫిట్‌నెస్ తో ట్రెండ్ సెట్ చేసిన భాయ్.. ఇప్పుడు తన అల్ట్రా–లగ్జరీ ఫ్యాషన్ తో యువతను ఆకట్టుకుంటున్నారు. రూ.62 లక్షల విలువైన జాకెట్ ధరించి ఆయన ఇచ్చిన ఫోజులు చూస్తుంటే.. బాలీవుడ్ సుల్తాన్ రేంజ్ ఏంటో మరోసారి స్పష్టమైంది. వస్తువు ఏదైనా అది సల్మాన్ ఖాన్ వేసుకుంటే వచ్చే ఆ కిక్కే వేరు అంటున్నారు అభిమానులు.

## ఒక్క మూవీతో రూ.200 కోట్లు కొల్లగొట్టిన హీరోయిన్.



సినీరంగంలో సంవత్సరాలుగా కొనసాగుతున్నప్పటికీ ఆశించిన స్థాయిలో గుర్తింపు రాని తారలు చాలా మంది ఉన్నారు. అలాగే హిట్స్ అందుకున్నప్పటికీ అవకాశాలు రాని హీరోయిన్స్ చాలా మంది ఉన్నారు. ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న బ్యూటీ సైతం తెలుగులో ఫేమస్. ఇటీవలే రూ.200 కోట్లు కొల్లగొట్టింది. ఇంతకీ ఆమె ఎవరో తెలుసుకుందామా.తెలుగులో ఆమె చేసిన సినిమాలన్నీ అట్టర్ ఫ్లాప్ అయ్యాయి. అయినప్పటికీ ఆశలు మాత్రం వదలుకోలేదు. చాలా కాలం తర్వాత ఇటీవలే బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఆమె నటించిన సినిమా ఏకంగా రూ.200 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఇంతకీ ఆమె ఎవరంటే.. తెలుగులో ఆమె చేసిన సినిమాలన్నీ అట్టర్ ఫ్లాప్ అయ్యాయి. అయినప్పటికీ ఆశలు మాత్రం వదలుకోలేదు. చాలా కాలం తర్వాత ఇటీవలే బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఆమె నటించిన సినిమా ఏకంగా రూ.200 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఇంతకీ ఆమె ఎవరంటే..టాలీవుడ్ ఇండస్ట్రీలో మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ కేరళ కుట్టి. కానీ ఇప్పటివరకు తెలుగులో సరైన హిట్టు మాత్రం అందుకోలేదు. ఆమె మరెవరో కాదండి. హీరోయిన్ కళ్యాణి ప్రియదర్శన్. అక్కినేని అఖిల్ హీరోగా నటించిన హలో సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది ఈ ముద్దుగుమ్మ. టాలీవుడ్ ఇండస్ట్రీలో మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ కేరళ కుట్టి. కానీ ఇప్పటివరకు తెలుగులో సరైన హిట్టు మాత్రం అందుకోలేదు. ఆమె మరెవరో కాదండి. హీరోయిన్ కళ్యాణి ప్రియదర్శన్. అక్కినేని అఖిల్ హీరోగా నటించిన హలో సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది ఈ ముద్దుగుమ్మ.ఈ సినిమా నిరాశ పరిచినప్పటికీ తన అందం, అభినయంతో ఆకట్టుకుంది. ఆ తర్వాత తెలుగులో ఆమె చేసిన సినిమాలు అంతగా మెప్పించలేకపోయాయి. ఇక ఇటీవల కొత్త లోక సినిమాతో ఈ ముద్దుగుమ్మ భారీ విజయాన్ని అందుకుంది. ఈ సినిమా నిరాశ పరిచినప్పటికీ తన అందం, అభినయంతో ఆకట్టుకుంది. ఆ తర్వాత తెలుగులో ఆమె చేసిన సినిమాలు అంతగా మెప్పించలేకపోయాయి. ఇక ఇటీవల కొత్త లోక సినిమాతో ఈ ముద్దుగుమ్మ భారీ విజయాన్ని అందుకుంది.డిఫరెంట్ కథతో వచ్చిన ఈ సినిమా రూ.100 కోట్లకు పైగానే వసూలు చేసింది. ఒక్క సినిమాతోనే అటు మలయాళం, ఇటు తెలుగులో విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ఇప్పుడు ఈ అమ్మడు తెలుగులో అవకాశం కోసం వెయిట్ చేస్తుంది. డిఫరెంట్ కథతో వచ్చిన ఈ సినిమా రూ.100 కోట్లకు పైగానే వసూలు చేసింది. ఒక్క సినిమాతోనే అటు మలయాళం, ఇటు తెలుగులో విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ఇప్పుడు ఈ అమ్మడు తెలుగులో అవకాశం కోసం వెయిట్ చేస్తుంది.ఇదిలా ఉంటే.. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే కళ్యాణి.. తాజాగా బ్లాక్ డ్రెస్ లో స్టన్నింగ్ స్టిల్స్ షేర్ చేసింది. గ్లామరస్ ఫోజులతో మతిపోగొట్టే అందాలతో కట్టిపడేస్తుంది. ఇప్పుడు ఈ అమ్మడు షేర్ చేసిన లేటెస్ట్ ఫోటోస్ తెగ వైరలవుతున్నాయి. ఇదిలా ఉంటే.. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే కళ్యాణి.. తాజాగా బ్లాక్ డ్రెస్ లో స్టన్నింగ్ స్టిల్స్ షేర్ చేసింది. గ్లామరస్ ఫోజులతో మతిపోగొట్టే అందాలతో కట్టిపడేస్తుంది. ఇప్పుడు ఈ అమ్మడు షేర్ చేసిన లేటెస్ట్ ఫోటోస్ తెగ వైరలవుతున్నాయి.

## ఎన్నాళ్లకెన్నాళ్లకు.. ఒక్క సినిమాతోనే సెన్సేషన్

సాధారణంగా సినీ ప్రపంచంలో సరైన గుర్తింపు రావడం అంత సులభం కాదు. తక్కువ సమయంలోనే ఓవర్ నైట్ స్టార్ డమ్ తెచ్చుకుని.. తర్వాత అదే క్రేజ్ కొనసాగించిన తారలు చాలా తక్కువ మంది. కానీ కొందరు హీరోయిన్స్ మాత్రం రాత్రికి రాత్రే సెన్సేషన్ అయిపోతుందటారు. ఆ తర్వాత మాత్రం ఇండస్ట్రీలోనే కనిపించకుండా పోతారు.పైన ఫోటోలో కనిపిస్తున్న అమ్మడును గుర్తుపట్టారా.. ? తెలుగులో ఒక్క సినిమాతోనే ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది. గ్లామర్ సెన్సేషన్ బ్యూటీగా మారిన ఈ ముద్దుగుమ్మ.. ఆ తర్వాత అవకాశాలు రాకపోవడంతో ఇండస్ట్రీలో సైలెంట్ అయ్యింది. పైన ఫోటోలో కనిపిస్తున్న అమ్మడును గుర్తుపట్టారా.. ? తెలుగులో ఒక్క సినిమాతోనే ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది. గ్లామర్ సెన్సేషన్ బ్యూటీగా మారిన ఈ ముద్దుగుమ్మ.. ఆ తర్వాత అవకాశాలు రాకపోవడంతో ఇండస్ట్రీలో సైలెంట్ అయ్యింది.అలాగే అటు సోషల్ మీడియాలోనూ అంతగా యాక్టివ్ గా ఉండడం లేదు. కానీ ఇప్పుడు వాలెంటైన్స్ డే సందర్భంగా చేతిలో గులాబీలతో ఫోటోలకు ఫోజిలిచ్చింది. ఇంతకీ ఈ ముద్దుగుమ్మ ఎవరా అని ఆలోచిస్తున్నారా.. ? తనే హీరోయిన్ నేహా శెట్టి. అలాగే అటు సోషల్ మీడియాలోనూ అంతగా యాక్టివ్ గా ఉండడం లేదు. కానీ ఇప్పుడు వాలెంటైన్స్ డే సందర్భంగా చేతిలో గులాబీలతో ఫోటోలకు ఫోజిలిచ్చింది. ఇంతకీ ఈ ముద్దుగుమ్మ ఎవరా అని ఆలోచిస్తున్నారా.. ? తనే హీరోయిన్ నేహా శెట్టి.మెహబూబా సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. ఆ సినిమా ఆశించిన స్థాయిలో ఆకట్టుకోకపోయినా.. అందం, అభినయంతో అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించింది. కానీ ఆమెకు బ్రేక్ ఇచ్చిన సినిమా మాత్రం డీజే టిల్లు. మెహబూబా సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. ఆ సినిమా ఆశించిన స్థాయిలో ఆకట్టుకోకపోయినా.. అందం, అభినయంతో అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించింది. కానీ ఆమెకు బ్రేక్ ఇచ్చిన సినిమా మాత్రం డీజే టిల్లు.న్నలగడ్డతో చేసిన ఈ మూవీ బ్లాక్ బస్టర్ హిట్టైంది. ఈ మూవీతోనే తెలుగులో ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది. ఇందులో లుక్స్ తోపాటు గ్లామర్ బ్యూటీగానూ కట్టిపడేసింది. ఆ తర్వాత తెలుగులో వరుస అవకాశాలు వస్తాయని అంతా భావించారు. సిద్ధు జొన్నలగడ్డతో చేసిన ఈ మూవీ బ్లాక్ బస్టర్ హిట్టైంది. ఈ మూవీతోనే తెలుగులో ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది. ఇందులో లుక్స్ తోపాటు గ్లామర్ బ్యూటీగానూ కట్టిపడేసింది. ఆ తర్వాత తెలుగులో వరుస అవకాశాలు వస్తాయని అంతా భావించారు. కానీ అలా జరగలేదు. చాలా కాలంగా సరైన బ్రేక్ కోసం చూస్తున్న నేహా.. ఇటీవల పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన ఓజీ చిత్రంలో స్పెషల్ సాంగ్ చేసింది. కానీ థియేటర్లలో మాత్రం ఈ బ్యూటీ స్పెషల్ సాంగ్ తొలగించి చివరకు యూట్యూబ్ లో రిలీజ్ చేసింది చిత్రయూనిట్. కానీ అలా జరగలేదు. చాలా కాలంగా సరైన బ్రేక్ కోసం చూస్తున్న నేహా.. ఇటీవల పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన ఓజీ చిత్రంలో స్పెషల్ సాంగ్ చేసింది. కానీ థియేటర్లలో మాత్రం ఈ బ్యూటీ స్పెషల్ సాంగ్ తొలగించి చివరకు యూట్యూబ్ లో రిలీజ్ చేసింది చిత్రయూనిట్.



## ఆ సినిమాకు వెళ్లి ఇంటర్వెల్ కే దండం పెట్టి వచ్చేసా



దర్శకుడు ఎస్.వి. కృష్ణారెడ్డి గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇప్పటివరకు ఎన్నో సూపర్ హిట్ చిత్రాలతో తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. కానీ చాలా కాలంగా ఆయన సినిమాలకు దూరంగా ఉంటున్న సంగతి తెలిసిందే. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో సినిమాపై తన విశిష్టమైన ఆలోచనలను, ప్రస్తుతం సినీ పరిశ్రమలో ఉన్న పోకడలపై ఆసక్తికర కామెంట్స్ చేశారు. కృష్ణారెడ్డి క్లెన్సెడ్ ఫిల్మ్స్ అనే తన నూతన బ్యానర్‌ను పరిచయం చేసినట్లు తెలిపారు. దీని అర్థం శుద్ధి చేయబడిన చిత్రాలు అని అన్నారు. గతంలో మనీషా ఫిల్మ్స్ పేరుతో సినిమాలు నిర్మించిన ఆయన, ఇప్పుడు కేవలం క్లీన్, కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రాలనే నిర్మిస్తానని స్పష్టం చేశారు. నేటి సినిమాల్లో సర్వసాధారణమైన అశ్లీలత, డబుల్ మీనింగ్ డైలాగ్‌లు, యు/ఎ సర్టిఫికేట్ పొందిన చిత్రాల్లో సైతం అభ్యంతరకర సన్నివేశాలు ఉండటంపై ఆయన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు.ఒక ఫిల్మ్‌మేకర్‌గా, ఆయన సినిమాను చూసే విధానం ఇతరులకంటే భిన్నంగా ఉంటుందని వివరించారు. తన సినిమాల్లో అబ్సర్డిటీ (అసంబద్ధత) లేదా డబుల్ మీనింగ్ డైలాగ్‌లు ఉండవని ఆయన స్పష్టం చేశారు. నటీమణుల దుస్తుల విషయంలో కూడా చాలా జాగ్రత్తగా ఉంటానని, అనుకోకుండా పైట చెంగు తొలగినా, నేరుగా ఆర్టిస్టుకు చెప్పకుండా కో–డైరెక్టర్ లేదా అసిస్టెంట్ డైరెక్టర్ ద్వారా సరిచేయిస్తానని తెలిపారు. ఇలాంటి క్లీన్ సినిమా దృక్పథంతోనే తాను కొనసాగుతానని కృష్ణారెడ్డి చెప్పారు.

## చనిపోయే 6 రోజుల ముందు ఉదయ్ కిరణ్ ఫోన్‌లో మాట్లాడాడు



దర్శకుడు వి.ఎన్.ఆదిత్య గతంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో దివంగత నటుడు ఉదయ్ కిరణ్‌తో తనకున్న రిలేషన్‌ను, అతడితో మాట్లాడిన చివరి మాటలు, శ్రీరామ్ సినిమాకు సంబంధించిన కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. శ్రీరామ్ చిత్రం విషయంలో రావాల్సినంత విజయం దక్కలేదని ఆదిత్య అభిప్రాయపడ్డారు. మనసంతా నువ్వే సినిమా విజయం తర్వాత ఉదయ్ కిరణ్‌కు వచ్చిన క్రేజ్ కారణంగా శ్రీరామ్ వంటి యాక్షన్ చిత్రానికి అంచనాలు వేరేలా ఉంటాయని ముందుగానే పోస్టర్ల విషయంలో తాను సూచించానని తెలిపారు. అయితే, మొహబ్బతే తరహా పోస్టర్లను విడుదల చేయడం, సినిమా యాక్షన్ జానర్‌కు విరుద్ధంగా ఉండటం తనను నిరాశపరిచిందని చెప్పారు.శ్రీరామ్ నిర్మాత బూరుగుపల్లి శివరామకృష్ణ విడుదలకు ముందే టేబుల్ ప్రాఫిట్స్ పొందడం వల్ల సినిమా పబ్లిసిటీపై ఆసక్తి చూపించలేదని ఆదిత్య వివరించారు. అటు మనసంతా నువ్వే నిర్మాత ఎం.ఎస్.రాజు సినిమా విజయం కోసం ఎంతో కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. ప్రమోషన్ల కోసం ఖర్చు చేస్తే లాభాలు తగ్గుతాయని నిర్మాత అనడంతో, తాను, ఉదయ్ కిరణ్ కలిసి ప్రచారం చేద్దామన్నా కూడా ఫలితం లేకపోయిందని ఆదిత్య పేర్కొన్నారు. ఇది సినిమా విజయానికి అడ్డంకిగా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు.ఉదయ్ కిరణ్ ఆత్మహత్యపై తనకు బాధ కంటే కోపమే ఎక్కువని ఆయన స్పష్టం చేశారు. ఆత్మహత్య అనేది బలహీనమైన చర్య అని, ఎంత దీనమైన స్థితిలో ఉన్నా జీవితం కంటే ఏదీ గొప్పది కాదని ఆయన చెప్పారు. ఉ